RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 196 మేడ్చల్ మల్కాజ్‌గిరి 7 ఆగష్టు 2024 బుధవారం పేజీలు : 4

### భారత్ - బంగ్లా సరిహద్దుల్లో కొనసాగుతున్న హైఅలర్ట్

ఢిల్లీ: భారత్ – బంగ్లా సరిహద్దుల్లో హైఅలర్ట్ కొనసాగుతోంది. బంగ్లాదేశ్ పరిణామాల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. బంగ్లా–భారత్ సరిహద్దుల్లో రాకపోకలను భద్రతా సిబ్బంది తాత్కాలికంగా నిలిపివేసింది. సరిహద్దులకు అదనపు బలగాలను బీఎస్ఎఫ్ తరలించింది. ఆర్మీ యూనిట్లను కూడా ప్రభుత్వం అప్రమత్తం చేసింది. బంగ్లాదేశ్ విద్యార్థి సంఘం నేతలతో నేడు ఆ దేశ ఆర్మీ చీఫ్ భేటీ అయ్యారు. దేశంలో నెల కొన్న అశాంతి, అల్లర్ల నేపథ్యంలో కీలక భేటీ జరిగింది. బంగ్లా ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిన తర్వాత కూడా అల్లర్లు కొనసాగాయి. ప్రధాని నివాసం, చీఫ్ జస్టిస్ నివాసం సహా అనేక అధికారిక నివాసాల్లోకి చొరబడి ఆందోళనకారులు లూటీ చేశారు. అల్లర్లను అదుపుచేసే ప్రయత్నాల్లో బంగ్లాదేశ్ ఆర్మీ, పోలీసు బలగాలు ఉన్నాయి.

# తెలంగాణ భూముల రేట్లు భారీగా పెంపు?



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత భూముల రేట్లు అమాంతం పడిపోయాయి. అసలు భూములు కొనేందుకు కూడా ఇద్దరు ముందుకు రావడం లేదు. కెసిఆర్ ప్రభుత్వం దిగిపోవడంతో... ఈ పరిస్థితి నెలకొంది. అయితే రాజ్యాంగ తెలంగాణ రాష్ట్రంలో భూముల ధరలు పెంచేలా చర్యలు తీసుకుంటుంది రేవంత్ రెడ్డి సర్కార్. తెలంగాణ రాష్ట్రంలో భూముల ధరలు.. సెప్టెంబర్ లో పెరిగే ఛాన్స్ లు ఉన్నాయని రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఎంత మేర ధరలు పెరగవచ్చు అనే దానిపై త్వరలోనే క్లారిటీ రాబోతుందని కూడా తెలిపింది. దీనిపైన రిజిస్ట్రేషన్ల శాఖ కసరత్తు చేస్తోందని సమాచారం.


ఇక అనంతరం తెలంగాణ ప్రభుత్వానికి నివేదిక కూడా ఇవ్వనుందట ఈ రిజిస్ట్రేషన్ల శాఖ. ఆ తర్వాత రెవెన్యూ మంత్రి సమీక్షించి తుది నిర్ణయం తీసుకుంటారని తెలిపారు అధికారులు. ధరల పెంపు ప్రతిపాదనను సంబంధిత వెబ్సైట్లో ఉంచి ప్రజాభిప్రాయం సేకరిస్తారని కూడా అధికారులు తెలుపుతున్నారు. ఈ ప్రక్రియకు మరో 30 రోజుల సమయం పట్టే ఛాన్స్ ఉందని అంటున్నారు.




## డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్న కవిత

దిల్లీ: మద్యం కుంభకోణం కేసులో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సీబీఐ కేసుకు సంబంధించి రౌస్ అవెన్యూ కోర్టులో దాఖలు చేసిన డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను ఎమ్మెల్సీ కవిత ఉపసంహరించుకున్నారు. కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం తుది విచారణను బుధవారానికి వాయిదా వేసింది. కానీ, తాజాగా పిటిషన్ ఉపసంహరించుకుంటున్నట్లు కవిత తరఫున న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. చట్ట ప్రకారం ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కోర్టును ఆశ్రయించే అవకాశం ఉన్నందున పిటిషన్ ఉపసంహరించుకుంటున్నట్లు వివరించారు. సీబీఐ ఛార్జిషీట్‌లో తప్పులున్నాయని పేర్కొంటూ, జులై 6న కవిత డీఫాల్ట్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఎలాంటి తప్పులు లేవని సీబీఐ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు జులై 22న ప్రత్యేక కోర్టు ప్రకటించింది. ఈ నెల 9న దీనిపై విచారణ జరపనుంది.

## ఔటర్, రీజనల్ రింగ్‌రోడ్ల మధ్యలో పారిశ్రామిక క్లస్టర్లు




హైదరాబాద్ : రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణానికి రెడీ అయిన తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించింది. ఔటర్, రీజనల్ రింగ్ రోడ్ల మధ్య ఓ పారిశ్రామిక సిటీని నిర్మించాలన్న ప్రణాళికలు సిద్ధం చేసుకోంటోంది. పారిశ్రామీకరణతో ఉపాధి అవకాశాలు పెంచాలని భావిస్తోంది. దీని కోసం ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇండస్ట్రియల్ సిటీ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆర్‌ఆర్‌ఆర్, ఓఆర్‌ఆర్ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ అవకాశాలుబాగా పెరుగుతాయి.

హైదరాబాద్ కోటి మంది జనాభాను పెంచి పోషిస్తోంది. దీనికి కారణం ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉండటమే. చుట్టూరా అన్ని రకాల పరిశ్రమలు ఎంతో మందికి ఉపాధిని అందిస్తున్నాయి. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ సహా కొత్త కొత్త రంగాలు హైదరాబాద్ లో ఉపాధి చూపిస్తున్నాయి. రీజినల్ రింగ్ రోడ్, ఓఆర్‌ఆర్‌కు సమీపంలో 25వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ సిటీ ఏర్పాటుపై ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కాలుష్యర హిత సిటీగా ఏర్పాటు చేయాలని హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబ డులకు ఊతమిచ్చేలా చర్యలు తీసుకోవాలని సర్కార్ చర్యలు ప్రారంభించింది. ఇక ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసే పారిశ్రామి క కాలనీల్లో అన్ని రకాల వసతులు కల్పించేలా సర్కార్ చర్యలు తీసుకోనుంది. గతంలో వచ్చిన సమస్యలు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలతో ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని అనుకుంటోంది. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ఇలాంటి క్లస్టర్ ఏర్పాటు చేయడం ద్వారా ఆయా ప్రాంతాల్లో ఉపాధి ఉద్యోగ అవకాశాలు మరింతగా విస్తరించనున్నాయి. ఇది రియాల్టీ రంగానికి బూస్టింగ్‌లా పనిచేయనుంది. ఇప్పటికే ఓఆర్‌ఆర్ సమీపంలో రియాల్టీ బిజినెస్ జోరుగా సాగుతోంది. ఓఆర్‌ఆర్ రేడియల్ రోడ్ల కనెక్టివిటీతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందనుంది. ఉద్యోగులకు, కార్మికులకు సరిపడా ఇళ్ల నిర్మాణం అవసరం అవుతుంది. దీంతో ఓఆర్‌ఆర్ ప్రాంతంలో మరిన్ని నివాస, వాణిజ్య నిర్మాణాలు చేపట్టడంపై రియల్ ఎస్టేట్ కంపెనీలు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి.




# వ్యూహం మార్చిన సీఎం రేవంత్!

## హిట్ లిస్టులో ఆ ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు?

హైదరాబాద్ : సామ దాన భేద దండోపాయాలు... భారతంలో చెప్పిన రాజనీతి సిద్ధాంతం... యుద్ధంలో పైచేయి సాధించేందుకు పాటించే యుద్ధ నీతే సామ, దాన, భేద, దండోపాయం. ఇప్పుడు తెలంగాణ పాలిటిక్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ రాజనీతినే ప్రయోగించాలని చూస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవు తున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు ఇన్నాళ్లు సామరస్యంగా వ్యవహరించిన ముఖ్యమంత్రి... అది అనుకున్న రీతిలో సాగకపోవడంతో రూట్ మార్చారా..? 26 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కారు దింపేసి... కాంగ్రెస్ లో విలీనం చేసేద్దాం అనుకున్న వ్యూహం వర్కవుట్ కాకపోవడంతో మరో ఎత్తు వేస్తున్నారా? బుజ్జగింపులను పక్కనపెట్టి ఇక కొరడా ఝుళిపించాలని చూస్తున్నారా? అసెంబ్లీలో సీఎం హెచ్చరికలను పరిశీలిస్తే. భారతంలో చెప్పిన రాజ తంత్రాన్నే రేవంత్ ప్రయోగించాలని భావిస్తున్నట్లు కన్పిస్తోందంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

**దారికి రాని ఎమ్మెల్యేలపై దండోపాయం ప్రయోగం? :** ఆపరేషన్ ఆకర్ష్ ద్వారా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వల వేసిన కాంగ్రెస్.. దారికి రాని ఎమ్మెల్యేలపై దండోపాయం ప్రయోగించాలని చూస్తుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసెంబ్లీ లోపల.. బయట.. తమకు చికాకులు సృష్టిస్తున్న గులాబీదళంపై కొరడా ఝుళిపిస్తే... అటు.. ఇటు.. ఊగిసలాటలో ఉన్న వాళ్లను ఆకర్షించొచ్చేనే నయా ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు కనిపిస్తోందంటున్నారు. ముఖ్యంగా గత వారం ముగిసిన అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరికలను పరిశీలిస్తే కాంగ్రెస్ వ్యూహం ఏంటో తెలుస్తోందంటున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్న కాంగ్రెస్ మాజీ సీఎం కేసీఆర్ చూపిన తోవలోనే నడుచుకుంటున్నట్లు సంకేతాలు పంపుతోంది.

**కేసీఆర్‌నే ఫాలో అయ్యేలా ప్లాన్..** ఇక దారికి రాని వారి విషయంలోనూ కేసీఆర్‌నే ఫాలో అయ్యేలా నువ్వు నేర్పిన విద్యయే నీరజాక్ష అన్నట్లు.... అసెంబ్లీలో దూకుడుగా వ్యవహరిస్తున్న ముగ్గురు ఎమ్మెల్యేలపై వేటు వేయాలని ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఈ విషయం దాచుకోకుండా.... ఒకరిద్దరిపై అనర్హత వేటు వేస్తే ఇంకెవరూ స్పీకర్ పోడియం వద్దకు రారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సీఎం ఇలా వ్యాఖ్యానించడంతో బీఆర్ఎస్ సభ్యులు అలర్ట్ అయ్యారంటున్నారు. ప్రస్తుతం అసెంబ్లీ వాయిదా పడటంతో గులాబీ ఎమ్మెల్యేలు గండం నుంచి గట్టెక్కారంటున్నారు.

**2018 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు..** 2018 ఎన్నికలకు ముందు అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంపత్‌కుమార్‌పై అనర్హత వేటు వేశారు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి. ఈ ఇద్దరూ శాసనసభ సమావేశాలకు అడ్డుగా ఉంటున్నారని, క్రమశిక్షణ అతిక్రమిస్తున్నట్టు అభియోగం మోపుతూ ఎమ్మెల్యే సభ్యత్వానికి అనర్హులుగా ప్రకటించారు. ఆ తర్వాత వారిద్దరూ కోర్టుకు వెళ్లినా లాభం లేకుండా పోయింది. ఐతే అప్పట్లో ఎన్నికలు సమీపించడంతో కోమటిరెడ్డి, సంపత్‌కుమార్ ప్రాతినిధ్యం వహించిన స్థానాలకు ఉప ఎన్నికలు రాలేదు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లోనూ వారిపై వేసిన అనర్హత వేటు సానుభూతి లేకుండా పోయింది. ఆ విషయాన్ని ప్రజలు కూడా పట్టించుకోకుండా కోమటిరెడ్డి, సంపత్‌లను ఓడించి.. కేసీఆర్ సర్కార్ పట్లే తమ విశ్వాసం ప్రకటించారు. దీంతో అప్పటి కేసీఆర్ స్ట్రాటజీనే ఇప్పుడు రేవంత్ కూడా ఫాలో అయ్యేందుకు స్కెచ్ వేస్తున్నారనే చర్చ జోరుగా సాగుతోంది.

**ప్రతిపక్షానికి గట్టి మెసేజ్ పంపాలనే ఉద్దేశ్యం..** అయితే ఇప్పుడు బీఆర్ఎస్ శాసనసభ్యులపై వేటు పడితే ఉప ఎన్నికలు జరిగే చాన్స్ ఉంది. దీంతో ఉప ఎన్నికలను ఎదుర్కోవడంతో పాటు%ౌ% ముగ్గురు ఎమ్మెల్యేలను శాసనసభ నుంచి బహిష్కరిస్తే తలెత్తే రాజకీయ పరిణామాలను విశ్లేషస్తుందంటున్నారు. ముందుగా తమ దారికి రాని ఎమ్మెల్యేలకు ఓ హెచ్చరిక పంపడంతోపాటు.. సభా వ్యవహారాల్లో కఠినంగా వ్యవహరిస్తామని ప్రతిపక్షానికి గట్టి మెసేజ్ పంపాలనే ఉద్దేశ్యంతోనే సీఎం రేవంత్ అలాంటి వ్యాఖ్యలు చేశారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

**ప్రభుత్వం హిట్‌లిస్టులో ఉన్న గులాబీ ఎమ్మెల్యేలు ఎవరు? :** సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరికలతో.... ప్రభుత్వం హిట్‌లిస్టులో ఉన్న గులాబీ ఎమ్మెల్యేలు ఎవరన్న చర్చ జరుగుతోంది. 38 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ఇప్పటికే 10 మంది కాంగ్రెస్ గూటికి చేరారు. ఇక మిగిలిన వారిలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులను టచ్ చేసే అవకాశం లేదంటున్నారు. ప్రధానంగా ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పిస్తున్న ముగ్గురు నేతలపైనే కాంగ్రెస్ ఫోకస్ చేసినట్లు చెబుతున్నారు. ఈ హిట్‌లిస్టులో హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పేర్లు వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురిపై అనర్హత వేటు వేస్తే ఎదురయ్యే పరిణామాలపై ఆరా తీస్తున్నట్లు చెబుతున్నారు.

**ఫస్ట్ టార్గెట్ కౌశిక్ రెడ్డి..! :** గులాబీ పార్టీలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఈ మధ్య ఎక్కువ హడావుడి చేస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు సీఎం రేవంత్‌రెడ్డిపైనా తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇక బ్లాక్ బుక్ పేరిట ప్రభుత్వం, అధికారుల తప్పులను నమోదు చేస్తున్నానని చెబుతున్న కౌశిక్‌రెడ్డి%ౌ%. అసెంబ్లీలో ప్రభుత్వంతో తీవ్ర స్థాయిలో ఫైట్ చేస్తున్నారు. ఇక కాంగ్రెస్‌లోని ఓ సీనియర్ నేతకు ఆయనతో సత్సంబంధాలు ఉండటం కూడా... కౌశిక్‌రెడ్డి హిట్ లిస్టులోకి వెళ్లడానికి కారణమంటున్నారు. కౌశిక్‌రెడ్డిపై వేటు పడితే ఇటు స్వపక్షంలోనూ%ౌ% అటు విపక్షంలోనూ ప్రత్యర్థులకు గట్టి మెసేజ్ పంపినట్లు అవుతుందని చెబుతున్నారు.

**కేసీఆర్ దారిలోనే వెళ్లి బీఆర్ఎస్ఎల్పీ విలీనానికి ప్లాన్..!** ఇక బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సన్నిహితులు. ఈ ఇద్దరిపై వేటు వేసి ఆ ఇద్దరికి చెక్ చెప్పాలనేది సీఎం ఆలోచనగా చెబుతున్నారు. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్%ౌ% కేటీఆర్‌కు అత్యంత సన్నిహితంగా ఉంటారు. ఎమ్మెల్యే సంజయ్‌ను అనర్హుడిగా ప్రకటిస్తే%ౌ%. మిగతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆటోమెటిక్ గా తమ దారికి వచ్చే అవకాశాలు ఉన్నట్లు కాంగ్రెస్ భావిస్తోంది. 2018లో కోమటిరెడ్డి.. సంపత్‌పై ఇలా వేటు వేయడం వల్లే... ఆ తర్వాత ఏర్పడిన కేసీఆర్ రెండో విడత సర్కార్ లో చేరికలకు ఎక్కువ సమయం తీసుకోలేదని అంటున్నారు. ఇప్పుడు తాము కూడా కేసీఆర్ దారిలోనే వెళ్లి.... బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకోవాలనే తమ పంతాన్ని నెగ్గించుకోవాలని వ్యూహం రచిస్తున్నట్లు చెబుతున్నారు.

## సంపాదకీయం

# ఆర్మీ చేతిలోకి బంగ్లాదేశ్ భారత్ కి రెడ్ సిగ్నల్ !

భారత దేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. ఎవరు కాదన్నా ఇక్కడ ఉన్నంత స్వేచ్ఛ మరెక్కడా దొరకదు. భారతదేశం గత ఏడున్నర దశాబ్దాలుగా ఎన్నడూ విచ్ఛిన్నకరమైన పరిస్థితులను ఎదుర్కోలేదు. యాభై ఏళ్ల క్రితం నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ దేశంలో అత్యవసర పరిస్థితి విధించినా ప్రజాస్వామ్య యుతంగా పోరాటం సాగింది, 18 నెలల పాటు ఆందోళనలు జరిగాయి కానీ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాసి వేరే శక్తులు తమ ఆధీనంలోకి తీసుకోలేదు. భారత్ మూలాల్లోనే ప్రజాస్వామిక స్ఫూర్తి ఉంది. ప్రాచీన ప్రజాస్వామ్యం అని అమెరికా వంటి దేశాలు చెప్పుకోవచ్చు కానీ ప్రజాస్వామ్యం అన్న పేరు వాడుకలో లేనప్పటి నుంచి వేల ఏళ్ళ నుంచే భారత్ లో ఆ సహనం ఉంది. ఆ శాంతి ఉంది. భిన్నత్వాన్ని గౌరవించే గొప్ప గుణం ఉంది. అదే భారత్ కి శ్రీరామ రక్షగా ఈ రోజుకీ ఉంది. భారత్ మట్టిలోనూ మూలాల్లోనూ ఇంకిపోయిన ప్రజాస్వామిక లక్షణాలు ఈ దేశాన్ని ఎల్ల వేళలా కాపాడుతూ ఉంటే భారత్ నుంచి వేరు పడిన పాకిస్థాన్ లో కానీ ఆ దేశం నుంచి వేరు పడిన బంగ్లాదేశ్ లో కానీ ఈ రోజు చూస్తున్న పరిణామాలు నియంతృత్వాన్ని స్వాగతిస్తున్నాయి. ఆర్మీ కనుసన్నల్లో దశాబ్దాలుగా పాకిస్తాన్ ఉంది. అక్కడ ప్రజా ప్రభుత్వం అన్నది ఒక ముసుగు గానే ఎప్పటికీ ఉంటోంది అన్నది అంతా చెప్పుకునేదే. ఇక బంగ్లాదేశ్ కూడా చివరికి అందులోకే వెళ్ళింది. బంగ్లాదేశ్ లో గత పదినేను ఏళ్ళుగా ప్రధానిగా పాలన చేస్తున్న షేక్ హసీనా అత్యంత దారుణమైన పరిస్థితుల్లో రాజీనామా చేసి ప్రాణాలను గుప్పటి పెట్టుకుని భారత్ కి రక్షణ కోసం రావాల్సి వచ్చింది. రిజర్వేషన్ల పేరిట ఆ దేశంలో కొన్నాళ్ళుగా సాగుతున్న దారుణ మారణ కాండ వెనక ఆర్మీ ఉన్నట్లుగా అనుమానాలు ఉన్నాయి. ఇపుడు అదే ఆర్మీ ప్రజా ప్రభుత్వం పీక నులిపి అధికారాన్ని చేతుల్లోకి తీసుకోవడానికి చూడడంతో నిజమని కూడా భావించే పరిస్థితులు ఉన్నాయి. ఇటీవలనే షేక్ హసీనా మరోసారి ప్రధానిగా నెగ్గారు. ప్రజా ప్రభుత్వం మళ్ళీ కొలువు తీరింది. ఆమె ప్రధానిగా ఉంటూ భారత్ కి నిజమైన మిత్రుడిగా బంగ్లాదేశ్ ని ఉంచింది. ఉగ్ర కార్యకలాపాలు బంగ్లా నుంచి దేశ సరిహద్దులలో చొరబడుతున్న వేళ కట్టడి చేసే ప్రయత్నం ఆమె చేస్తున్నారు. ఇపుడు ఆర్మీ చేతులలోకి అధికారం వెళ్ళడంతో భారత్ కి ఉగ్రవాదుల దాడులు చొరబాట్లు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఒక విధంగా బంగ్లాదేశ్ ఆర్మీ చేతులల్లోకి వెళ్లడం అంటే భారత్ అన్ని విధాలుగా జాగ్రత్త పడాల్సి ఉంటుందని అంటున్నారు. ఇప్పటికే పాకిస్థాన్ తో భారత్ కి తలనొప్పులు ఉన్నాయి. చైనాతో ఇబ్బందులు ఉన్నాయి. ఇపుడు మరో పొరుగు దేశం బంగ్లాదేశ్ ఆర్మీ చేతుల్లోకి వెళ్ళడం అంటే భారత్ వేయి కళ్ళతో తన అంతర్గత భద్రతను కాపాడుకోవాల్సి రావచ్చు. ఇక పశ్చిమ బెంగాల్ లో బంగ్లాదేశ్ నుంచి వలస వాదులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిణామాలు భారత్ కి పూర్తి స్థాయిలో చికాకు పెట్టేవే అని అంటున్నారు మరో వైపు చూస్తే బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్ చేరుకున్నారు. హిండన్ ఎయిర్‌బేస్‌లో హసీనా విమానం ల్యాండింగ్ అయింది. అదే విధంగా బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న అల్లర్ల నేపథ్యంలో షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ప్రస్తుతం సైనిక పాలన లో బంగ్లాదేశ్ వెళ్ళిపోయింది. ఈ నేపథ్యంలో సాటి మిత్రురాలిగా ఆమెను సమాదరించి షేక్ హసీనాకు ఆశ్రయమిచ్చిన భారత్ తన గొప్ప మనసు చాటుకుంది. అంతే కాదు ఈ ఉద్రిక్తమైన పరిణామాల నేపథ్యంలో భారత్ బంగ్లా సరిహద్దులో హైఅలర్ట్ ని సైతం ప్రకటించారు. అంతే కాదు సరిహద్దుల్లో బలగాలను అప్రమత్తం చేసిన బీఎస్ఎఫ్ పూర్తి నిఘాని పెట్టింది. అదే విధంగా కూచ్‌బెహార్, పెట్రాపోల్ సరిహద్దుల్లో భద్రతను పూర్తి స్థాయిలో పెంచింది. అదే విధంగా భారత్‌లోని బంగ్లాదేశ్ ఎంబసీ దగ్గర భద్రత పెంచార్. దాంతో పాటుగా బంగ్లాదేశ్ హైకమిషన్ దగ్గర భద్రత కట్టుదిట్టం చేశారు. ఈ మొత్తం పరిణామాలను భారత్ నిశితంగా పరిశీలిస్తోంది.

# అధ్వాన దారులు.. అవస్థల ప్రయాణాలు



తాండూరు: జిల్లాలో రహదారులు, భవనాలశాఖ ప్రధాన రోడ్లతో పాటు పల్లెలకు అనుసంధానంగా ఉన్న పంచాయతీరాజ్ రోడ్లు అధ్వానంగా మారాయి. వీటిపై రాకపోకలు నిర్వహించే ద్విచక్ర వాహనదారులు తరచూ ఒళ్లు నొప్పులతో అవస్థలు పడుతున్నారు. వాహనాలు మరమ్మతుకు గురవుతున్నాయి. నిధులున్న ప్రాంతాల్లో కూడా అధికారులు పనులు చేయకపోవడం శోచనీయం. మరి కొన్నిచోట్ల నిధులు లేక పనులు జరగడం లేదు. ప్రస్తుత వానాకాలం ప్రారంభం అయింది. ప్రజలకు మరింత ఇబ్బందులు ఎదురవ్వనున్నాయి. సత్వరం అధికారులు స్పందించి బాగుచేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

గుంతలు పడి.. నీరు నిలిచి..

తాండూరు మండలం ఈద్గా నుంచి చెంగేష్‌పూరు మీదుగా ఎల్మకన్నె వెళ్లే రోడ్డులోకంకర, తారు తొలగి గుంతలు పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వీటిల్లో వరద చేరి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గౌతాపూరు నుంచి చెంగోల్ వరకు కూడా ఇదే పరిస్థితి. తాండూరు పట్టణం నుంచి నారాయణపూర్ వెళ్లే రోడ్డు రైల్వే గేటు వరకు మట్టితో కూడుకున్నది కావడంతో అవస్థలు తప్పడం లేదు. కరణ్‌కోట నుంచి గౌతాపూరు వరకు వచ్చే రోడ్డు చిత్తడిగా మారింది. గౌతాపూరు నుంచి తాండూరు వరకు జాతీయ రహదారిపై చాలా చోట్ల రెండుఅడుగుల లోతు గుంతలు పడ్డాయి.

మరమ్మతు లేక తాండూరు నుంచి మహబూబ్‌నగర్ వైపు వెళ్లే మార్గంలోని తాండూరు రైల్వే వంతెనపై గుంతలు పడినా మరమ్మతు చేయడంలేదు. 2014లో రూ.7కోట్లతో దీనిని నిర్మించారు. మూడేళ్ల వరకు బాగానే ఉన్నా, అనంతరం తారు తొలగిపోయింది. ఈ గుంతలపై నుంచి వెళ్లిన వాహనాలు తరచూ మరమ్మతుకు గురై ఆగిపోతున్నాయి.

ప్రమాదకరంగా..: తాండూరు నుంచి వికారాబాద్ వైపు వెళ్లే రోడ్డును 2017లో రూ.52 కోట్లతో విస్తరించే పనులు ప్రారంభించారు. చాలా చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. తాండూరు పట్టణం విలియమ్ మూన్ కూడలి నుంచి పెద్దేముల్ మండలం దుగ్గాపూరు వరకు అస్తవ్యస్తంగా మారింది.

ఇదీ లెక్క:రహదారులు, భవనాల శాఖ పరిధిలో 911.869 కిలోమీటర్లు. ఇందులో 361.875 కిలోమీటర్ల విస్తరణ, వంతెనల నిర్మాణం, రహదారుల మరమ్మతు వంటి 57 పనులను రూ.637.93 కోట్లతో చేపడుతున్నారు. కొన్ని పూర్తయినా, ఇంకొన్ని పూర్తి కాలేదు. మరికొన్ని ప్రారంభానికి నోచలేదు.

పంచాయతీరాజ్ శాఖ పరిధిలో అన్ని రకాల రోడ్లు 2,781.29 కిలోమీటర్లు. రూ.262.94 కోట్లతో 917 పనులు చేపడుతున్నారు. ఇందులో 681 పూర్తయ్యాయి. మిగిలినవి కొన్ని ప్రారంభమయ్యాయి.

వంతెనపై చువ్వలు తేలినా..

పెద్దేముల్ మండలం బుద్దారం వాగుపై రూ.3కోట్లతో నిర్మించిన వంతెనపై ఇనుప చువ్వలు తేలాయి. వర్షాకాలంలో నీరు చేరితే వాహనదారులు వేగంలో వెళ్లే సమయంలో అదుపు తప్పి పడిపోయే ప్రమాదం ఉంది. గాజీపూరు వద్ద రూ.6 కోట్లతో నిర్మించిన వంతెనకు అనుసంధానంగా చేపట్టే తారు రోడ్డు పనులు పూర్తి కాలేదు. పెద్దేముల్ నుంచి గిరిజన తండా, రుద్రారం మీదుగా నాగులపల్లి వరకు వెళ్లే తారు రోడ్డు అడుగుకోగుంతతో వాహనాలు మరమ్మతుకు గురవతున్నాయి. బుద్దారం నుంచి పెద్దేముల్ తండా వరకు రూ.కోటికి పైగా నిధులతో తారు రోడ్డు నిర్మించాల్సి ఉంది. కొన్ని చోట్ల కంకర పరిచి వదిలేశారు.

కంకర తొలగి

బెన్నూరు నుంచి మండలకేంద్రం యాలాల వరకు ఉన్న తారు రోడ్డు అక్కడక్కడ గుంతలు పడ్డాయి. లక్ష్మీనారాయణపూరు నుంచి ఎన్కేపల్లి, కమాల్‌పూరు నుంచి బాగాయిపల్లి వరకు వెళ్లే దారిపై కంకర, తారు తొలగింది. బండమీది పల్లి నుంచి జుంటుపల్లి, చెన్నారం నుంచి నాగారం వరకు ప్రధాన మంత్రి సడక్ యోజన కింద రూ.2.68 కోట్లతో నిర్మించాల్సిన రోడ్డును కేవలం కంకర పరిచి వదిలేశారు.

నిధుల లభ్యత ప్రకారం పూర్తి చేస్తాం: రహదారులు, భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ ఈఈలు

జిల్లాలో మరమ్మతుకు వచ్చిన రహదారులకు నిధుల మంజూరు లభ్యతను బట్టి పూర్తి చేస్తామని వికారాబాద్ రహదారులు, భవనాల శాఖ ఈఈ లాల్‌సింగ్, తాండూరు, వికారాబాద్ పంచాయతీ రాజ్ శాఖ ఈఈలు శ్రీరాములు, వికారాబాద్ ఈఈ ఉమేష్ కుమార్ తెలిపారు. వర్షాకాలంలో అత్యవసరంగా చేపట్టే పనులపై దృష్టి పెట్టామని, వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామనిపేర్కొన్నారు.

# ఎవరికీ పట్టని వలస బతుకులు

పెద్దపల్లి: వలస కార్మికుల రక్షణకు పాలకులు ఎన్ని చట్టాలు తీసుకువచ్చినా.. క్షేత్ర స్థాయిలో అమలు చేయాల్సిన అధికారులు ప్రేక్షక పాత్రకే పరిమితం అవుతున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. వెరసి రోజు రోజుకు జిల్లాలో వలస కూలీలకుపై దాడులు పెరుగుతున్నాయి. రోడ్డెక్కితే తప్పా వారి ఫిర్యాదులను కూడా పట్టించుకునే పరిస్థితి జిల్లాలో లేకుండా పోయింది. తాజాగా సుల్తానాబాద్‌లో ఘటన వలస కూలీల భద్రతపై సందేహాలను లేవనెత్తింది.

దస్త్రాల్లో కనిపించని కార్మిక గణాంకాలు

పనులు చేసేందుకు కూలీలు కావాలనేది పరిశ్రమల నిర్వాహకుల లక్ష్యంగా ఉండటంతో వారు ఇతర రాష్ట్రాల నుంచి దళారుల సహాయంతో కూలీలను సమకూర్చుకుంటున్నారు. వారి వివరాలేవి అధికారులకు ఇవ్వడమనే విధానమే లేదు. పరిశ్రమల నిర్వహణకు అనుమతులు ఇవ్వడం మినహా అందులో జరిగే ఉత్పత్తులు, పనిచేసే కార్మికులు, వారికి మౌలిక వసతుల కల్పించడం లాంటివేవి తమ పరిధిలోకి రావని పరిశ్రమల శాఖ అధికారులు చెబుతుండటం గమనార్హం. ఒక పరిశ్రమలో పనిచేసే స్థానికులు, స్థానికేతరులు ఎంతమంది? కనీస వేతనం లభిస్తుందా? కార్మికులను ఏవిధంగా నియమించుకుంటున్నారు.. వారిలో నైపుణ్య కార్మికులు ఎంతమంది.? నైపుణ్యం లేనివారెంత మంది.? అనే గణాంకాలేవి అధికారుల వద్ద లేవు.

పని కేంద్రాల్లో సౌకర్యాలేవీ?

జిల్లాలో వలస కూలీల సంఖ్య వేలల్లో ఉంది. సీజన్‌ను బట్టి కూలీల సంఖ్య మారుతూ ఉంటుంది. ఇటుక బట్టీలు, బియ్యం మిల్లులు, పత్తిమిల్లులతో పాటు భవన నిర్మాణం, ఇతర పరిశ్రమలల్లో ఒడిశా, బిహార్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝూర?ండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన వారు 10 వేల నుంచి 20 వేల వరకు జిల్లాలో



జీవనం సాగిస్తున్నారు. వీరందరూ కుటుంబాలతో వచ్చి, నెలల తరబడి ఇక్కడే పనిచేసుకుంటారు. నైపుణ్య కార్మికులు సొంతంగా అద్దె నివాసాల్లో ఉంటూ జీవనం సాగిస్తుండగా, అన్‌స్కిల్డ్ కార్మికులు మాత్రం దళారుల సహాయంతో ఇక్కడి వచ్చి, వెట్టిచాకిరి పనుల్లో మగ్గుతున్నారు. పరిశ్రమల నిర్వాహకులు వీరికి పనిప్రాంతంలోనే నివాసాలు ఏర్పాటు చేస్తుంటారు. అరకొర గదుల్లో ఉండలేక, ఆరుబయటే కూలీలు నిద్రిస్తుండటంతో తరచూ ప్రమాదాలకు గురవుతుంటారు. సుల్తానాబాద్‌లోని బియ్యం మిల్లులో జరిగిన ఘటనలోనూ బాలికతో పాటు బాలిక తల్లి కూడ ఆరుబయటే నిద్రించడంతో కామాందుడి దృష్టి పడింది. గతంలో ఇటుక బట్టీల ప్రాంతంలోనూ ఆరుబయట నిద్రిస్తున్న కూలీలపై వాహనాలు వెళ్లి ప్రమాదాలబారిన పడిన ఘటనలున్నాయి. పాములు, విషపు పురుగుల బారిన పడి అనేక మంది వలస కూలీలు మృత్యువాత పడుతున్నారు.

మిల్లుల్లో ఆవాసాలతో మాకు సంబంధం లేదు

బియ్యం మిల్లులు, ఇతర పరిశ్రమల్లో పని చేసే వలస కార్మికులు, వారికి పరిశ్రమలు ఏర్పాటు చేసే ఆవాసాలు, ఇతర మౌలిక వసతులతో మాకు సంబంధం లేదు. వాటిని పరిశ్రమల శాఖ పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆయా రంగాల్లో పనిచేసే కార్మికుల కోసం అనుమతి తీసుకోవాలి. ఇటుక బట్టీలలో పనిచేసే వలస కార్మికుల సమస్యలు, వారికి మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలు కల్పించడం, రక్షణ చర్యలు తీసుకోవడంలో మా శాఖ దృష్టి పెడుతుంది. – రాంమోహన్, సహాయ కార్మికాధికారి నాలుగింటికే అనుమతి ఉందిజిల్లాలో కేవలం నాలుగు బియ్యం మిల్లులు మాత్రమే పరిశ్రమల శాఖ నుంచి అనుమతి తీసుకున్నాయి. పరిశ్రమలకు అనుమతిం చడంలో పర్యావరణ ఇబ్బందులను కూడా పరిగణనలోకి తీసుకొంటాం. కానీ అందులో పనిచేసే కార్మికులు, వారికి వసతుల కల్పన మా పరిధిలోకి రావు. ఘటన జరిగిన బియ్యం మిల్లు పరిశ్రమల శాఖ నుంచి అనుమతి తీసుకోలేదు. – మధుసూధనచారి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్

# మరో 100 రోడ్లకు వాణిజ్య హోదా



హైదరాబాద్: ఆదాయం పెంపు దిశగా జీహెచ్ఎంసీ మరో ముందడుగు వేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో మరో వంద రోడ్లకు వాణిజ్య హోదా ఇచ్చేందుకు కసరత్తు ప్రారంభించింది. గత సర్కారు 2021లో జీ.వో.నెం.102 ద్వారా 118 రోడ్లకు వాణిజ్య హోదా ఇచ్చింది. మారిన పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న అధికారులు.. మరో వంద రోడ్లకు ఆ హోదా ఇవ్వొచ్చనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి 100 అడుగులు, అంతకన్నా ఎక్కువ వెడల్పున్న రోడ్లను ఎంపిక చేసి ప్రాథమిక జాబితాను సర్కారుకు అందించారు. ప్రభుత్వ నిర్ణయం వచ్చాక రోడ్ల ఎంపికపై మరింత కసరత్తు చేసి తుది జాబితాను సిద్ధం చేసే అవకాశం ఉంది. తుదిరూపం ఏర్పడితే రూ.100 కోట్ల ఆదాయం సమకూరనుంది.

హైదరాబాద్ మహానగరపాలక సంస్థ(జీహెచ్ఎంసీ) 2007లో ఏర్పాటైంది. 17ఏళ్లు గడిచినా ఆశించిన స్థాయిలో నగరాభివృద్ధి ప్రణాళికకు తగ్గట్టు రూపుదిద్దుకోలేదు. హెచ్ఎండీఏ పరిధిలోనూ అంతే. వాస్తవ పరిస్థితులకు, మాస్టర్‌ప్లాన్‌కు చాలా వ్యత్యాసం ఉంది. బృహత్ ప్రణాళికలో మాదిరి రోడ్ల విస్తరణ, నిర్మాణం జరగట్లేదు. దానితో షాపింగ్ మాల్స్, భారీ వాణిజ్య భవనాలు ఉన్న రోడ్లు అనేకం ఇప్పటికీ నివాస కేటగిరీలో ఉన్నాయి. ఇళ్ల కోసమంటూ అనుమతి తీసుకునే పలువురు యజమానులు, నివాసయోగ్యతాపత్రం(ఓసీ) తీసుకున్నాక ఆయా భవనాలను వ్యాపార కేంద్రాలుగా మార్చుతున్నారు. ఈ రకంగా పార్కింగ్ వసతి లేని భవనాలు రూపం మార్చుకోవడంతో.. పార్కింగ్ వసతి లేక వాహనాలు రోడ్లపై నిలుస్తున్నాయి. ఇతరత్రా సమస్యలూ తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం మరో వంద రోడ్లకు వాణిజ్య హోదా ఇచ్చి, వాటిని సమగ్రంగా అభివృద్ధి చేయాలని భావిస్తోంది.ఆదాయం పెరుగుతుందిలా..: ఏదైనా రహదారిని వాణిజ్య రహదారిగా గుర్తిస్తే జీహెచ్ఎంసీకి వేర్వేరు రూపాల్లో ఆదాయం పెరుగుతంది. సహజంగానే ఆస్తిపన్ను ఆదాయం రెట్టింపు నుంచి మూడు రెట్లు పెరుగుతుంది. వాణిజ్య సముదాయాలను నిర్మించాలనుకునే యజమానులకూ మేలే. వాణిజ్యేతర రహదారులపై కమర్షియల్ కాంప్లెక్సులను నిర్మించాలంటే ప్రభుత్వాన్ని సంప్రదించి భూ వినియోగాన్ని మార్చుకోవాలి. ఆ ప్రక్రియ చాలా వ్యయప్రయాసలతో కూడుకుని ఉంటుంది. వాణిజ్య రహదారిపై అయితే.. నేరుగా వాణిజ్య కేటగిరీలో నిర్మాణ అనుమతి లభిస్తుంది. నివాస సముదాయాలనూ నిర్మించుకోవచ్చు. నిర్మాణదారు భవనం విస్తీర్ణంలోని ప్రతి చదరపు అడుగుకు రూ.300ల నుంచి రూ.400ల ఇంపాక్ట్ ఫీజును జీహెచ్ఎంసీకి చెల్లించాల్సి ఉంటుంది. కొత్త ప్రతిపాదన సాకారమైతే.. ఆస్తిపన్ను, నిర్మాణ అనుమతి రుసుము, ఇంపాక్ట్ ఫీజుల రూపంలో జీహెచ్ఎంసీకి ఏటా రూ.100కోట్ల ఆదాయం అదనంగా సమకూరుతుందని అంచనా.

# ఇసుకను తోడి.. హద్దులు మీరి

కామారెడ్డి: బిచ్కుంద మండలం ఖద్గాం–శెట్లూర్ శివారులో ఆరు క్వారీలలో ఇసుక తవ్వకాలకు గత ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఆయా రీచ్‌లలో తవ్వకాలు చేసే గుత్తేదారుల కాలపరిమితి ముగిసింది. నిర్దేశించిన మేర ఇసుక తవ్వకాలు పూర్తికాలేదనే నెపంతో మూడు నెలల కిందట ఇసుకాసురులు మళ్లీ అనుమతులు సాధించారు. ఖద్గాంలోని క్వారీ, గుండెనెమ్లిలోని మరో క్వారీలో రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. గుత్తేదారులు తవ్విన ఇసుకను రీచ్‌లలో డంప్ చేయాల్సి ఉంటుంది. దీనిని టీఎస్ఎండీసీ



ఆధ్వర్యంలో విక్రయించాలి. కానీ టీఎస్ఎండీసీ అధికారులతో కుమ్మక్కయిన గుత్తేదారులు రాజధానితో పాటు మహారాష్ట్ర, కర్ణాటకకు ఇసుకను తరలిస్తూ దోపిడీ చేస్తున్న తీరుపై కథనం.

సమస్తం ఉల్లంఘనలే రవాణా శాఖ నుంచి వేబిల్లులు తీసుకొని.. ఒకే బిల్లుపై పది నుంచి 20 టిప్పర్లలో ఇసుకను తరలిస్తున్నారు. క్వారీలు, రీచ్‌లలో సీసీకెమెరాలు ఏర్పాటు చేసి తవ్వకాలు చేయాలి. కానీ విరుద్ధంగా సాగుతోంది. ఎవరైనా క్వారీలు, రీచ్‌లలోకి వస్తే ప్రైవేటు సెక్యూరిటీతో దాడులు చేయిస్తూ భయపెడుతున్నారు.

రాష్ట్రంలోనే ఇసుక విక్రయించాల్సి ఉండగా.. మహారాష్ట్ర, కర్ణాటకలకు తరలిస్తున్నారు. ఇటీవల ఖద్గాం క్వారీ నుంచి అనుమతులు లేకుండా జహీరాబాద్ మీదుగా కర్ణాటకు ఇసుకను తరలిస్తున్న ఐదు లారీలను సంగారెడ్డి జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకోవడమే ఇందుకు నిదర్శనం.రాత్రి వేళల్లో వేబిల్లులు లేకుండా ఖద్గాం, గుండెనెమ్లి రీచ్‌ల నుంచి వందలాది టిప్పర్లలో ఇసుకను మహారాష్ట్రకు తరలిస్తున్నారు. రెండు రోజుల కిందట మహారాష్ట్రకు వెళ్తున్న ఐదు ఇసుక లారీలను బిచ్కుంద పోలీసులు పట్టుకుని సీజ్ చేయడమే ఇందుకు సాక్ష్యం.

# హాజరుకు నకిలీ మకిలి

హైదరాబాద్ : పారిశుద్ధ్య కార్మికులను వేధిస్తూ.. వారి జీతాన్ని జేబులో వేసుకుంటోన్న కేటుగాళ్లకు జీహెచ్ఎంసీ అడ్డాగా మారింది. సూపర్‌వైజర్లు, ఏఎంఓహెచ్(సహాయ వైద్యాధికారి)లు ప్రతి నెలా రూ.కోట్ల ప్రజాధనాన్ని కొల్ల గొడుతున్నారు. ఇటీవల కొత్తగా ఐటీ విభాగం బాధ్యతలు తీసుకున్న ఐఏఎస్ అధికారిణి దోపిడీని అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ.. ఫలితం దక్కలేదు. వేలి ముద్రల హాజరు విధానాన్ని రద్దు చేసి, ముఖాన్ని స్కానింగ్ చేసే ఎఫ్ఆర్‌సీ యాప్‌ను తీసుకొస్తే.. అందులోని లోపాలను వసూల్ రాజాలు కనిపెట్టేశారు. విధుల్లో లేని కార్మికులను ఉన్నట్టుగా చూపించి వారందరి జీతాలను జేబులో వేసుకుంటున్నారు. జీహెచ్ఎంసీలో 18 వేల మంది కార్మికులుంటే..అందులో ప్రతిరోజూ సుమారుగా 16 వేల మంది విధుల్లో ఉంటారు..వీరిలో దాదాపు నకిలీ హాజరుతో 1000 మంది వేతనాలను సూపర్‌వైజర్లు నొక్కేస్తున్నారు. ఇది దాదాపుగా రూ.2 కోట్లు ఉంటుందని అంచనా.

రూ.2లక్షలు డిమాండ్..: సికింద్రాబాద్ జోన్ ముషీరాబాద్ సర్కిల్‌లోని ఓ డివిజన్‌లో సూపర్‌వైజర్ పరిధిలో 21 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. అందులోని ఐదుగురు కార్మికులు పని చేయకపోయినా హాజరు వేసి వేతనాలను తీసుకుంటున్నారు. వారికి రూ.2,500లు ఇస్తారు. తమను విధుల్లోకి చేర్చుకోవాలంటే రూ.2లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని వాపోతున్నారు.

'నిఘా'ఇలా..: కొందరు బాధితులు ఆశ్రయించి.. తమకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. మరుసటి రోజే సూపర్‌వైజరు నుంచి వాళ్లకు ఫోన్ వచ్చింది. జూన్ 3న ఉదయం 10గంటలకు బ్యాంకుకు వెళ్లి జీతం తీసుకోవాలని చెప్పాడు. బాధితులతో కలిసి బ్యాంకు వద్ద నిఘా ఉంచింది. కాసేపటికి సూపర్‌వైజరు వద్ద పనిచేసే మరో కార్మికురాలు కొన్ని బ్యాంకు పాసుపుస్తకాలను తీసుకొని వచ్చింది. అక్కడికి చేరుకున్న ఇద్దరు బాధితులను లోపలికి తీసుకెళ్లి జీతం డబ్బును డ్రా చేయించి, ఆ మొత్తాన్ని ఆమె తీసుకుంది. ఆ ఇద్దరు బాధితులకు రూ.2,500లు ఇచ్చి వెళ్లిపోయింది. అనంతరం.. బృందం జీహెచ్ఎంసీ ఉన్నతాధికా



రులను, ఐటీ విభాగాన్ని సంప్రదించింది. సూపర్‌వైజరు పరిధిలో పనిచేస్తోన్న కార్మికుల రోజువారీ హాజరును ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే.. వారికి రోజూ హాజరు పడుతోంది. కానీ.. కొన్ని నెలలుగా వారు విధులకు వెళ్లట్లేదని చేప్పే ఆధారాలను ఇస్తే ఆశ్చర్యపోయారు.

విధానంలో లోపాలు..నకిలీ వేలి ముద్రలతో హాజరు వేస్తున్నారని.. ఎఫ్ఆర్‌సీ యాప్‌ను జీహెచ్ఎంసీ ఏప్రిల్ నుంచి అమల్లోకి తెచ్చింది. దాంతో దాదాపు 1,500ల మంది నకిలీ కార్మికుల పేర్లు వెలుగులోకి వచ్చాయి. వారం తిరిగే సరికి.. మళ్లీ కార్మికుల సంఖ్య పెరగడం మొదలైంది. యాప్‌లో ఉన్న లోపాలే అందుకు కారణమని తెలుస్తోంది. ఎస్ఎఫ్ఏలు స్కాన్ చేస్తోన్న కార్మికుల ముఖాలు సాఫ్ట్‌వేర్‌లో నిల్వ ఉండట్లేదు. ఎస్ఎఫ్ఏ చేస్తోన్న నకిలీ హాజరును గుర్తించే సదుపాయం ఏఎంఓహెచ్‌కే ఉంది. పై అధికారులు సిబ్బంది ఫొటోలను చూసేందుకు యాప్ అనుమతించట్లేదు. కార్మికుల ఫొటో లేదా వీడియోలను ఉపయోగించి సూపర్‌వైజర్లు, ఏఎంఓహెచ్‌లు నకిలీ హాజరుకు పాల్పడుతున్నారు.

# సమస్యలు కోకొల్లలు



సిరిసిల్ల : జిల్లాలోని టెక్స్‌టైల్‌పార్కు ఏర్పాటు లక్ష్యం నెరవేరడం లేదు. సంక్షోభంలోని వస్త్ర పరిశ్రమకు ఆధునికత వైపు నడిపించాలనే ఉద్దేశంతో తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలో 2005-06 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టెక్స్‌టైల్ పార్కుకు ప్రణాళికలు రూపొందించాయి. 2012లో 65 ఎకరాల విస్తీర్ణంలో 216 యూనిట్లకు అనువుగా పార్కును ప్రారంభించారు. చిన్న, మధ్యతరహా, వ్యాపార అవసరాలకు కోసం విడివిడిగా స్థలాలు కేటాయించారు. స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 116 యూనిట్లు కేటాయించారు. తొలిదశలో రెండు వేల మంది కార్మికులు ఉపాధి పొందారు. నెలకు 3.50 లక్షల మీటర్ల వస్త్రోత్పత్తి జరిగేది. హైదరాబాద్, మహారాష్ట్ర, గుజరాత్‌ల నుంచి ఆర్డర్లు తెచ్చుకుని ఉత్పత్తి చేసేవారు. దేశవ్యాప్తంగా వస్త్రపరిశ్రమ సంక్షోభంలో పడితే దాని ప్రభావం ఇక్కడి పార్కుపైనా ఉండేది. దీంతో నెలల తరబడి పరిశ్రమలు మూతపడటం.. పరోక్షంగా విద్యుత్తు బిల్లులు.. బ్యాంకు రుణాలకు వడ్డీలు పేరుకుపోయేవి. ఆర్థిక ఇబ్బందులతో పరిశ్రమలను మూసివేశారు. ప్రస్తుతం పార్కులో సంక్షేమ శాఖ ఆర్డర్లు 32 యూనిట్లలో ఉత్పత్తి జరుగుతుంది. గరిష్ఠంగా 300 మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే మరిన్ని రోజుల్లో పార్కు మనుగడే కష్టంగా మారనుంది.

**ప్రభుత్వ విప్ దృష్టికి సమస్యలు**

రాష్ట్రంలో మొదటి టెక్స్‌టైల్ పార్కులో నెలకొన్న పరిస్థితులు.. కార్మికుల ఉపాధి తదితర అంశాలను తెలుసుకునేందుకు ఇటీవల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆధ్వర్యంలో చేనేత, జౌళీశాఖ అధికారులు పార్కులో పర్యటించారు. ఈ సందర్భంగా యజమానులు పార్కులో నెలకొన్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. చెన్నై, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటకలో వస్త్రోత్పత్తి పరిశ్రమలో అక్కడి ప్రభుత్వాలు విద్యుత్తు రాయితీని ఇసున్నాయి. ఇక్కడ మాత్రం యూనిట్‌కు రూ.8 చెల్లిస్తున్నారు. గత ప్రభుత్వం విడతల వారీగా విద్యుత్తు బిల్లులపై రీయింబర్స్‌మెంటును విడుదల చేస్తూ వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం యూనిట్‌పై రాయితీ ఇవ్వాలని కోరారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు నూలు బ్యాంకును ఏర్పాటు చేయాలి. దీనికోసం 11 మంది యజమానులకు ఒక సొసైటీ చొప్పున ఏర్పాటు చేసుకున్నారు. అయినా ప్రభుత్వం నూలు బ్యాంకు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆర్డర్లకు తగ్గట్టుగా ఉత్పత్తి చేయలేని పరిస్థితి. ఒకవేళ సొంతంగా ఆర్డర్లు తెచ్చుకుని ఉత్పత్తి చేద్దామన్నా పెట్టుబడికి ఇబ్బందులే. కారణం పరిశ్రమలకు ప్రభుత్వం ఎన్ఓసీ ఇవ్వక బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు.

పార్కులో రాపియర్ మరమగ్గాలపై ఉత్పత్తి అయిన వస్త్రాలను నేరుగా మార్కెట్‌లోకి తీసుకెళ్లే పరిస్థితుల్లేవు. కారణం ఇక్కడ (పోస్టు వీవింగ్, ప్రీ వీవింగ్) ప్రక్రియకు అవసరమైన ఉమ్మడి వసతుల కేంద్రం లేదు. దీంతో ముడి వస్త్రాన్ని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయాల్సిన పరిస్థితి. ఈ యూనిట్ ఏర్పాటుకు పార్కులో 15 ఎకరాల స్థలం కేటాయించారు. ఎంఎస్ఎంఈలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉమ్మడి వసతుల కేంద్రం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలి. యజమానులు ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపైనే పార్కు భవితవ్యం.. కార్మికుల ఉపాధి ఆధారపడి ఉంది.

# హెచ్ఎండీఏ భూములకు రక్షణేది?

జిన్నారం : ఐడీఏ బొల్లారం పరిధిలోని సర్వే నంబరు 278లో గతంలో ఉన్న రోడ్డును మార్చి హెచ్ఎండీఏ స్థలాలను ఆక్రమించి రహదారి వేశారు. ఈ అక్రమణను అధికారులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదే సర్వే నంబరులోని ఓ భారీ వెంచరు కోసం సుమారు రెండు ఎకరాలను ఆక్రమించుకున్నట్లు ఆరోపణలున్నాయి. సర్వే నంబరు 284లో 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గతంలో మినీ స్టేడియానికి కేటాయించారు. ఆ తర్వాత సంబంధిత భూములను హెచ్ఎండీఏ పరిధిలోకి మార్చారు. ఈ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా.. పట్టించుకునే వారే కరవయ్యారు. ఖాజీపల్లి పరిధిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జిన్నారం మండలంలోని ఐడీఏ బొల్లారం, ఖాజీపల్లి గ్రామాల శివారులో.. బాహ్య వలయ రహదారిని ఆనుకొని ఉన్న స్థలాలను 2004లో రెవెన్యూ శాఖ హెచ్ఎండీఏకు అప్పగించింది. అక్కడి భూముల ధరలు భారీగా పెరగడంతో ఆక్రమణదారుల కన్ను వాటిపై పడింది. క్రమంగా ఆక్రమిస్తూ విక్రయిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికే చాలా స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. కొందరు ఆక్రమణదారులు జీవో 59 ప్రకారం స్థలాలను క్రమబద్ధీకరించుకున్నారు.



**రోడ్డు వేస్తున్నా పట్టింపు లేదు**

ఐడీఏ బొల్లారం పరిధిలో 194 ఎకరాలు, ఖాజీపల్లి పరిధిలో 72 ఎకరాల హెచ్ఎండీఏ స్థలాలున్నాయి. ఇక్కడ గజం భూమి విలువ రూ.30 వేలకు పైగా ఉంది. కొందరు స్థిరాస్తి వ్యాపారులు ఖాజీపల్లి నుంచి ఐడీఏ బొల్లారం వరకు హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న గుట్టను తవ్వేశారు. ఈ విషయాన్ని గుర్తించిన సంబంధిత అధికారులు వ్యాపారిపై కేసు పెట్టారు. ఆ తర్వాత ఎలాంటి చర్యలు లేవు. అదే స్థిరాస్తి సంస్థ మరో చోట కాలనీ కోసం రోడ్డు వేసింది. ఇలా రూ.కోట్ల విలువ చేసే భూములు పరాధీనమవుతున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు

రమణారెడ్డి, హెచ్ఎండీఏ క్షేత్రాధికారి

హెచ్ఎండీఏ పరిధిలోని స్థలాలు ఎక్కడ కబ్జాలకు గురైనా వెంటనే చర్యలు తీసుకుంటాం. ఇటీవల ఐడీఏ బొల్లారం పరిధిలోని కొన్ని స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని మాకు ఫిర్యాదులు అందాయి. సర్వే చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించాం. ఖాజీపల్లి, బొల్లారంలో నిర్దేశిత హద్దులు లేకపోవటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

# సర్కారు కళాశాలలకు అరకొర నిధులు

సంగారెడ్డి : ప్రభుత్వ కళాశాలల్లో పేద విద్యార్థులే ఎక్కువ మంది చదువుతారు. వీటి నిర్వహణకు సరిపడా నిధులు కేటాయించి.. బోధన మెరుగుగా ఉంటే పేద విద్యార్థుల భవిత ఉత్తమంగా ఉంటుంది. కానీ సంబంధిత శాఖ అరకొర కేటాయింపులు చేసి.. చేతులు దులుపుకొంటుండటంతో కళాశాలల నిర్వహణకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని చోట్ల ప్రధానాచార్యులు సొంతంగా డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

**రూ.1.64 లక్షల విడుదల**

జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి ఈ విద్యా సంవత్సరం జూన్ ఒకటో తేదీ నుంచి తరగతులు నిర్వహిస్తున్నారు. నిర్వహణ కోసం అరకొర నిధులు మంజూరు చేస్తున్నారు. అవీ నాలుగు నెలలకోసారి అందిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా మొదటి విడత కింద ఒక్కో కళాశాలకు రూ.25 చొప్పున కేటాయించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా నిర్వహణ నిధుల మొత్తాన్ని పెంచకపోవడంపై ప్రధానాచార్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తొలి విడత కింద జిల్లాకు రూ.1.64లక్షలు ఇటీవల విడుదల చేశారు.

**రుసుంల వసూలు నిలిపేయడంతో..**

2012-2013 విద్యా సంవత్సరం వరకు ప్రవేశాల సమయంలో విద్యార్థుల నుంచి కొంత రుసుం వసూలు చేసేవారు. ఈ మొత్తాన్ని కళాశాల నిర్వహణకు ఖర్చు చేసేందుకు వీలుండేది. పిల్లల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం 2014 నుంచి రుసుంల వసూలును నిలిపివేసింది. సర్కారే నేరుగా నిర్వహణ నిధుల్ని



అందిస్తోంది. విద్యా సంవత్సరం అంతా కలిపి ఒక్కో విద్యార్థికి రూ.100 చొప్పున కేటాయించగా మొదటి విడత కింద రూ.25 చొప్పున విడుదల చేయగా.. నిధులు సరిపోని పరిస్థితి నెలకొంది.

సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తా

గోవిందరామ్, జిల్లా ఇంటర్ విద్యాధికారి


ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్ని కళాశాలల ఖాతాలకు సర్దుబాటు చేస్తున్నాం. ప్రస్తుతం ఒక్కో విద్యార్థికి రూ.25 చొప్పున విడుదలయ్యాయి. నిర్వహణ నిధులు పెంచాలని విజ్ఞప్తులు వస్తున్నాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ చూపుతా.

జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు: 20

ప్రథమ సంవత్సరం విద్యార్థులు: 4,027

ద్వితీయ: 3,395

# రుణమాఫీ కాలేదు..!



జగిత్యాల : జిల్లాలో రెండు విడతల్లో కలిపి రూ.1.50 లక్షల వరకు (అసలు, వడ్డీ కలిపి) పంటరుణంగల 58,852 మంది రైతులకు రూ.376.69 కోట్ల నిధులను ప్రభుత్వం రైతుల రుణఖాతాకు విడుదల చేసింది. తమకు నిధులందలేదని ఇప్పటివరకు దాదాపుగా 2 వేలమంది వరకు రైతులు ఏఈవోలు, ఏవోలు, బ్యాంకుల్లో సంప్రదిం చటంతో పాటుగా కలెక్టరేట్లోని గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. మాఫీ నిధులందకపోవటంపై దాదాపుగా 30 వరకు కారణాలను గుర్తించారు.

సారంగాపూర్ మండలం అర్పపల్లికి చెందిన పి.రాజిరెడ్డి-లక్ష్మి దంపతులు జగిత్యాలలోని బ్యాంకులో రూ.1.30 లక్షల పంటరుణం తీసుకోగా మాఫీ కటాఫ్ తేదీవరకు అసలు, వడ్డీకలిపి రూ.1.45 లక్షలుగా తేలినా రెండో విడతలో వీరికి నిధులందలేదు. ఆధార్‌లోని పేరు, రుణఖాతా లోని పేరు వేరువేరుగా ఉన్నదనే కారణంతో వీరికి నిధులు రాలేదు. ఇలా వీరిమాదిరిగా జిల్లాలోని వేలాదిమంది రైతులు పంటరుణ మాఫీ నిధులందక ఆందోళన చెందుతున్నారు.

మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామంలో సుమారు 130 మంది రైతులకు రుణమాఫీ జరగలేదని తెలుస్తోంది. మెట్‌పల్లి మండలంలో వేంపేట, చింతలపేటతో పాటు మల్లాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో పలువురు రైతులకు రుణమాఫీ కాలేదని తెలుస్తోంది. రుణమాఫీ జాబితాలో పేర్లు లేకపోవడంతో అయోమయానికి గురవుతు న్నారు. వేంపేటలో స్థానికంగా ఉన్న ఓ బ్యాంకు పరిధిలో రుణాలు తీసుకున్న రైతులకే ఈ సమస్య ఉత్పన్నమైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోయామని, త్వరలోనే పరిష్కారమవుతుందని ఏవో షాహిద్‌అలీ తెలిపారు.

మాఫీ వస్తుందనే కారణంతో చాలామంది రుణాలను చెల్లించలేదు. ప్రభుత్వం 12.12.2018 నుంచి 9.12.2023 తేదీల మధ్యన తీసుకున్న కొత్తరుణాలు, రెన్యూవల్స్ చేసుకున్న స్వల్పకాలిక పంట రుణాలకు మాత్రమే మాఫీ వర్తింపచేయటంతో చాలామంది దూరమయ్యారు.

ఆధార్‌కార్డు, బ్యాంకులోరుణ ఖాతాల్లోని పేర్లు సరిపోలకపోవటం, కొన్ని బ్యాంకుల రుణఖాతాకు ముందుగా సున్నా అంకె ఉండటంతో నిధుల బదిలీ జరగలేదు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డుతో సరిపోల్చి కార్డులోని కుటుంబ సభ్యులకు నిర్దేశిత మొత్తానికి లోపుంటేనే జాబితాలో ప్రకటించారు.

మరణించినవారి భూమిని వారసులకు బదలాయించగా బ్యాంకుల్లో రుణమున్నా ప్రస్తుతం ధరణిలో పట్టావివరాలు లభ్యంకాలేదని నిధులను విడుదల చేయలేదు. దీర్ఘకాలిక టర్మ్ రుణాలు, సాగుఅనుబంధ, రీషెడ్యూల్డ్ రుణాలను పరిగణనలోకి తీసుకోలేదు.మా కుటుంబంలో నాకు మాత్రమే..

వేంపేట గ్రామంలో ఉన్న ఓ బ్యాంకులో రూ.1.45 లక్షల రుణం తీసుకున్నాను. రెండో విడతలో ప్రభుత్వం రూ.1.50 లక్షల లోపు వారికి మాఫీ చేసింది. మా కుటుంబంలో నాకు మాత్రమే రుణం ఉంది. మాఫీ జాబితాలో నా పేరు లేదు. బ్యాంకులో అడిగాను. అర్హత ఉన్న నాకు రుణమాఫీ చేయాలి.

డొంగిసారపు లచ్చయ్య, వేంపేట

**అర్హత ఉన్నా అందలేదు**

నాకు రూ.1.43 లక్షల రుణముండగా ఎప్పటికప్పుడు రెన్యూవల్ చేస్తాను. రెండో జాబితాలో నిధులు రావాల్సి ఉన్నా రాలేదు. నాలాగే చాలామందికి నిధులు రాకపోగా అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి.

గంగనర్సు, రైతు, మల్లాపూర్

**నెలరోజుల్లోగా పరిష్కరిస్తాం..**

రైతుల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు రాష్ట్ర వ్యవసాయశాఖ సంచాలకులకు పంపించి పరిష్కరిస్తున్నాము. రైతులు ఏఈవోలు, ఏవోలు లేదా కలెక్టరేట్లోని 94934 93026 గ్రీవెన్స్‌సెల్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చు.

బి.వాణి, వ్యవసాయశాఖ జిల్లా అధికారిణి

**సరిదిద్దుతున్నాం..**

రెండు విడతల మాఫీ నిధుల బదిలీల్లో జిల్లాలోని రెండుమూడు బ్యాంకుల్లో ఆటంకం కలగగా సరిదిద్దుతున్నాము. ఆధార్, ఖాతాల్లో తప్పుల సవరణ, ఖాతాలు ఆన్‌లైన్ లేకపోవటం వంటి సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయి అధికారులకు వివరించి అర్హులందరికీ నిధుల బదిలీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

రామ్‌కుమార్, లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్

# నిలిచిన పనులకు నిధులు

హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (జీహెచ్ఎంసీ)కు నిధులు అందుబాటులో లేకపోవడంతో ఎక్కడికక్కడే అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ఈ పరిస్థితిపై సమీక్షించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బల్దియాకు తక్షణం నిధులను విడుదల చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు.

**రూ.2 వేల కోట్ల బకాయిలు..** గత ప్రభుత్వ హయాంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టినా నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయలేదు. దీంతో గుత్తేదారులకు దాదాపు రూ.2 వేల కోట్ల వరకు బల్దియా బకాయిలు పడింది. ఇందులో రూ.1500 కోట్లు రోడ్ల నిర్మాణాలు చేపట్టిన గుత్తేదారులకే ఇవ్వాల్సి ఉంది. నిధులు విడుదల కాకపోవడంతో ఏడాదిగా పనులు ఆపేశారు. అనేకమార్లు వివిధ పనులకు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రావడం లేదు. పరిస్థితిని ఇటీవల పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ సీఎం రేవంత్‌రెడ్డికి వివరించడంలో దశలవారీగా నిధులు విడుదల చేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

హెచ్ఎండీఏ నుంచి నిధులు విడుదల చేస్తే తక్షణం పనులను చేపట్టడానికి అవకాశం ఉందన్న ఉద్దేశంతో దానకిషోర్ దీనిపై సమావేశాన్ని నిర్వహించారు. హెచ్ఎండీఏ నుంచి రూ.150 కోట్లను విడుదల చూస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో నిలిచిన బ్రిడ్జిలు, రోడ్ల నిర్మా ణాన్ని మొదలు పెట్టబోతున్నారు.



కాలనీల్లో రోడ్ల నిర్మాణం ఏడాదిగా ఆగిపోయింది. ఇప్పుడు ప్రాధాన్య క్రమంలో ఈ పనులూ చేపట్టనున్నారు. ఆర్థిక శాఖ వచ్చే వారం చివరికి రూ.300 కోట్లను విడుదల చేయబోతున్నట్లు పురపాలక శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఇవి కాకుండా బడ్జెట్‌లో బల్దియాకు రూ.3 వేల కోట్లకు పైగా కేటాయించారు.

**జోన్‌కు రూ.20 కోట్లు..** హెచ్ఎండీ నుంచి విడుదల చేసిన రూ.150 కోట్ల నిధుల్లో ఒక్కో జోన్‌కు రూ.20 కోట్ల చొప్పున ఆరు జోన్లకు రూ.120 కోట్లను కేటాయించనున్నారు. సర్కిల్‌కు రూ.కోటి చొప్పున 30 సర్కిళ్లకు రూ.30 కోట్లను అందిస్తారు. రాష్ట్ర ఆర్థిక శాఖ విడుదల చేసే రూ.300 కోట్లను ఇలానే జోన్ల వారీగా కేటాయించనున్నారు. ఎస్ఆర్‌డీపీ కింద కీలకమైన అనేక వంతెనల నిర్మాణం మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# ప్రయాణం సాఫీగా.. ప్రమాదాలు తగ్గేలా..

మెదక్ : మూడు జిల్లాలను కలిపే రహదారి అది. అసలే ఒక వరుసగా ఉండడం, గుంతలు పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మరో వైపు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నిత్యం ఆయా జిల్లాలకు వందల మంది ప్రయాణించే రోడ్డు విస్తరణకు కేంద్రం నిధులు మంజూరు చేయడంతో భూసేకరణ పూర్తి చేశారు. గత మార్చిలో శంకుస్థాపన జరుగగా, కొద్ది రోజుల కిందట పనులు ప్రారంభమయ్యాయి. జిల్లాలో 12 కి.మీల మేర జాతీయ రహదారి విస్తరణ జరగనుంది.

**పది మండలాల పరిధిలో..**

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 44వ జాతీయ రహదారి, సంగారెడ్డి నుంచి మహారాష్ట్ర నాందేడ్ వరకు 161, 765(డి) ఇప్పటికే మెతుకు సీమ మీదుగా వెళుతున్నాయి. 44వ రహదారి పరిధిలో రామాయంపేట, నార్సింగి, చేగుంట, తూప్రాన్, మనోహరాబాద్ మండలాలు, 161లో అల్లాదుర్గం, పెద్దశంకరంపేట మండలాలు, 765(డి) నర్సాపూర్, కౌడిపల్లి, కొల్చారం, మెదక్ మండలాలున్నాయి. 44వ జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉంటోంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు రవాణా మార్గం కావడంతో మహారాష్ట్ర, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రజలకు సౌకర్యంగా మారింది. 161 మార్గాన్ని అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ నుంచి పెద్దశంకరంపేట మండలం జంబికుంట వరకు విస్తరించారు. కొద్ది నెలల కిందట జిల్లా కేంద్రం మెదక్ నుంచి హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వరకు 765(డీజీ) పనులు ప్రారంభించగా కొనసాగుతున్నాయి.

**మలుపులను తొలగిస్తూ..**

గత మార్చిలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు వద్ద ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. హవేలిఘనపూర్ మండల కేంద్రం మీదుగా ఎల్లారెడ్డి వరకు 43.91 కి.మీ.ల మేర విస్తరణ పనులు కొద్ది రోజుల క్రితం షురూ అయ్యాయి. జిల్లా సరిహద్దులోని హవేలిఘనపూర్ మండలం పోచమ్మరాల్ వరకు పనులు జరుగుతున్నాయి. పలుచోట్ల వంతెనల నిర్మాణం, రహదారి విస్తరణ చేపడుతున్నారు. మెదక్ పట్టణం నుంచి హవేలిఘనపూర్‌కు వెళ్లే దారిలో రాయిన్ చెరువు, శాలిపేట, పోచారం వన్యప్రాణి అభయారణ్యం వద్ద మలుపులు తొలగిస్తున్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టనున్నాయి.

**వేలాది వాహనాల రాకపోకలు**

హైదరాబాద్ బాలానగర్ నుంచి నర్సాపూర్, మెదక్, కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి, బాన్సువాడ, నిజామాబాద్ జిల్లాలోని బోధన్, నిర్మల్ జిల్లాలోని భైంసా వరకు 258 కి.మీ.ల మేర ఉన్న ఈ రహదారిపై రోజు వేలసంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. ఒకే వరుస కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో 2016లో కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిగా ప్రకటిస్తూ విస్తరణకు అప్పట్లో రూ.322 కోట్లు కేటాయించింది. మొదటి విడతలో హైదరాబాద్ గండిమైసమ్మ బాహ్యవలయ రహదారి నుంచి మెదక్ పట్టణం వరకు 62 కి.మీ.ల మేర పనులు చేశారు. జిల్లాలో నర్సాపూర్ మండలం కొండాపూర్ నుంచి మెదక్ పట్టణం పసుపులేరు వంతెన వరకు విస్తరించారు. నాలుగేళ్ల కిందట ఈ పనులు పూర్తి కాగా, మెదక్ -ఎల్లారెడ్డి వరకు విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ.399 కోట్లు కేటాయించింది.


# చిన్నారులకు వ్యాధుల ముప్పు

సంగారెడ్డి: నిత్యం వర్షపు జల్లులతో పాటు.. వాతావరణం చల్లగా ఉంటోంది. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. అవి కుట్టడంతో అన్ని వర్గాల వారు జ్వరాలు, ఇతరత్రా సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా వాతావరణ మార్పుల వల్ల చిన్న పిల్లలు పలు రకాల వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు చిన్న పిల్లలతో కిటకిటలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రానికి(ఎంసీహెచ్) పిల్లల తాకిడి పెరిగింది. అక్కడ సరిపోను వైద్యులు లేకపోవడంతో ఇబ్బందిగా మారింది.

**పెరిగిన బాధితులు**

జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 30 పడకలతో మాతా శిశు ఆరోగ్య కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇక్కడ అత్యవసర విభాగానికి మరో 10 పడకలు కేటాయించారు. వర్షాకాలం నేపథ్యంలో గతంకంటే ఎక్కువ మంది పిల్లలను వైద్యానికి తీసుకొస్తున్నారు. వైద్యులు సరిపడా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. జూన్ 1 నుంచి జులై 31 వరకు ఎంసీహెచ్‌కు 11,096 మంది పిల్లలు వైద్యానికి వచ్చారని ఆ శాఖ అధికారులు తెలిపారు. వీరిలో అత్యధికంగా జ్వర పీడితులు 1,910 మంది ఉన్నారు. ఇక్కడ పిల్లలకు వైద్య సేవలందించడానికి ప్రస్తుతం ఇద్దరు ప్రొఫెసర్లు, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, అయిదుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధులు నిర్వహిస్తున్నారు. అదనంగా నలుగురు వైద్యాధికారులు, మరో ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను భర్తీ చేయాల్సి ఉంది.

అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి



జి.అనిల్‌కుమార్, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకులు

ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. చిన్నారులకు జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలపై వైద్యారోగ్యశాఖ అప్రమత్తంగా ఉంది. ప్రస్తుతం జిల్లాలో సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. వైద్యులకు అత్యవసరమైతేనే సెలవులు ఇస్తున్నాం. జిల్లాలోనే వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. అత్యవసరమైతే నిలోఫర్, గాంధీ ఆసుపత్రులకు పంపిస్తున్నాం.

**పరిసరాల పరిశుభ్రత కీలకం**

వానాకాలం నేపథ్యంలో పిల్లలు శ్వాస సంబంధిత సమస్య, జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు. వారిని చల్లని వాతావరణంలోకి తీసుకెళ్లవద్దు. ఇంట్లోనూ వెచ్చగా ఉండేలా చూసుకోవాలి. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి. మురుగు నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది.. రోగాలకు కారణమవుతాయి. వేడి పదార్థాలనే తినాలి. నిల్వ చేసిన ఆహార పదార్థాలను తినకపోవడం ఉత్తమం. రహదారుల వెంట విక్రయించే వివిధ రకాల చిరుతిళ్ల వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి. పిల్లలకు నిత్యం పోషకాహారం అందించాలి. అనారోగ్యానికి గురైతే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. సొంత వైద్యం సరికాదు.

మురళీకృష్ణ, చిన్న పిల్లల వైద్యుడు(ఎంసీహెచ్)

# తక్కువ సమయం.. ఎక్కువ మందికి ప్రయోజనం

హైదరాబాద్: క్యాన్సర్ చికిత్సలో కీలకమైన రేడియోషన్ థెరఫీలో అత్యాధునిక సేవలు ఎంఎన్‌జేలో అందుబాటులోకి రానున్నాయి. దాదాపు రూ.30 కోట్లతో ఈ ఆధునిక రేడియేషన్ థెరఫీ యంత్రాన్ని ఆసుపత్రిలో సమకూర్చారు. అటమిక్ ఎనర్జీ విభాగం నుంచి అనుమతులు వచ్చిన తర్వాత ఈ సేవలు అందించనున్నారు. ఇలాంటి ఆధునిక యంత్రాలు ప్రస్తుతం పెద్దపెద్ద కార్పొరేట్ ఆసుపత్రులో ఉన్నాయి. రేడియో థెరఫీలో ఇదో విప్లవాత్మక మార్పు అని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ యంత్రంపై పిల్లలతోపాటు పెద్దలకు రేడియో థెరఫీ అందించే వీలు ఉంటుంది.

ఇవీ ఉపయోగాలు..ప్రస్తుతం ఆసుపత్రిలో నిత్యం చెరో 300 చొప్పున కీమో, రేడియేషన్ థెరఫీలు అందిస్తున్నారు. కొన్నిసార్లు ఒక్కొక్కరికి అందించడం ద్వారా ఎక్కువ సమయం పడుతోంది. ఈ ఆధునిక యంత్రంతో తక్కువ సమయంలో ఎక్కువ మందికి చికిత్స అందించవచ్చు.క్యాన్సర్ కణితిని కూడా కచ్చితత్వంతో ధ్వంసం చేస్తుంది.



రేడియేషన్ థెరఫీలో క్యాన్సర్ కణాలతోపాటు ఆరోగ్యకరమైన కణాలు దెబ్బతింటుంటాయి.ఆరోగ్యకరమైన కణాలు దెబ్బతింటే పునరుత్పత్తి కష్టమవుతుంది. ఈ ఆధునిక యంత్రంలో అలాంటి ఇబ్బంది తక్కువ. పూర్తిగా కణితి ఉన్న చోటే రేడియో థెరఫీ అందించనున్నారు. అతిచిన్నగా ఉన్న కణుతులను ఈ థెరఫీతో పూర్తి స్థాయిలో చికిత్స అందించే వీలుంది.ప్రైవేటులో లక్షలు ఖర్చయ్యే వివిధ రకాల క్యాన్సర్లకు ఎంఎన్‌జేలో ఉచితంగా అందించనున్నారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి ఎక్కువ మంది రోగులు వస్తున్నారని, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అందించే బీమా సేవలు ఎంఎన్‌జేలో అమలయ్యేలా పరస్పర అవగాహన కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు.

# పూడిక తొలగింపుతోనే.. భవిష్యత్తుకు భరోసా

జగిత్యాల : శ్రీరాంసాగర్ జలాశయంలో పూడిక పేరుకుని నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు తగ్గినట్లు ఇటీవలే అధికారులు గుర్తించారు. కాగా 112 టీఎంసీల సామర్థ్యం గల ఎస్సారెస్పీలో ఇదివరకే నీటినిల్వ సామర్థ్యం 90.313 టీఎంసీలకు తగ్గగా ప్రస్తుతం మరో 10 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం తగ్గటం ఆందోళనకర అంశంగా మారింది. ఈ ప్రభావం జగిత్యాల జిల్లాపై అమితంగా పడనుండగా వాననీటి సంరక్షణతోనే జిల్లాలో సాగుకు సుస్థిరత ఏర్పడనుంది.

గతేడాది వానాకాలంలో ఎస్సారెస్పీలోకి 209 టీఎంసీల వరదనీరు రాగా నిల్వసామర్థ్యం లేనందున దాదాపుగా 100 టీఎంసీల వరకు నీటిని మిగులు జలాలుగా గోదావరిలోకి వదలాల్సి వచ్చింది. జిల్లాలోనూ సాధారణం కన్నా 32 శాతం అధిక వర్షపాతం నమోదైనా దాదాపుగా 28 టీఎంసీలకుపైగా వరదనీరు వృథాగా దిగువకు వెళ్లిపోయింది. అధిక వర్షం కురిసిన సందర్భాల్లో వరదతో ఇబ్బందులు తలెత్తినా ఏడాదిపొడవునా అన్నింటికీ ఆధారమైన వర్షపునీటి సంరక్షణ, వినియోగం అత్యంత అవశ్యంగా మారింది. ముఖ్యంగా వ్యవసాయాధారిత జిల్లాలో వర్షపునీటికి ఎనలేని ప్రాధాన్యం ఉంది. జిల్లాలోని 4.33 లక్షల ఎకరాల సాగులో 2.42 లక్షల ఎకరాల పైర్లకు వర్షపునీటితో ఉబికివచ్చే భూగర్భ జలాలే ప్రధాన నీటివనరుగా ఉండటం వాననీటి ప్రాధాన్యతను కళ్లకు కడుతోంది.

ఒక ఏడాదిలో సరాసరిగా 85-103 గంటల వాన మాత్రమే కురుస్తుండగా.. వర్షపు నీటిని ఒడిసి పట్టుకుని ఏడాది పొడవునా



వినియోగించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి వర్షపునీటి వినియోగం 10-17 శాతం మాత్రమేకాగా ఇది మరో 12 శాతం పెంచగలిగితే సాగు, తాగునీటి సమస్యలు తీరతాయని నిపుణుల అంచనా. వర్షపాతంలో దాదాపు 40-51 శాతం వరకు భూమిలోకి ఇంకకుండా పొలంబయటకు వృథాగా పోతోంది. వర్షపునీటితో నేల పైపొరల్లో విలువైన పోషకాలతో కూడిన మట్టి కొట్టుకుపోతుంది. దీనికిగాను ప్రతి పొలంలోనూ లోతట్టులో నీటినిల్వ కందకాలను తవ్వాలి. పండ్లతోటల్లో, వాలుకు అడ్డంగాదున్ని కాంటూరు సేద్యాన్ని అనుసరించాలి, తోటల్లో వాలుకు అడ్డంగా మట్టికట్టల ద్వారా వర్షపునీరు నిల్వఉండి నేలలోనే ఇంకేలా చేయవచ్చు.వ్యవసాయ బావులను రీఛార్జ్‌చేసేలా బావికి సమీపంలో గుంతనుతవ్వి వృథానీటిని ఇందులోకి మళ్లించాలి. ఇళ్లలో ఇంకుడు గుంతలను సమర్థంగా నిర్వహించాలి. అటవీ ప్రాంతంలో వాటర్‌షెడ్ కార్యక్రమాల్లో భాగంగా ఉపాధిహామీ ద్వారా కాంటూరు కందకాలను పెద్దఎత్తున తవ్వి వర్షపునీటిని నేలలోకి ఇంకేలా చేయటం సత్ఫలితాలు ఇస్తోంది. జిల్లాలో 1,226 చెరువులుండగా మరమ్మతు పూర్తిచేసి అన్నింటిలోనూ పూర్తిస్థాయిలో వర్షపునీటిని నిల్వ చేయాలి. వ్యవసాయంలో నీటివినియోగ సామర్థ్యం 20-43 శాతం ఉండగా బిందు, తుంపర్ల సేద్యంతో 69-93 శాతం వరకు పెంచేవీలుండగా ఈ పరికరాలను రాయితీపై ఇవ్వాలి. మన తలసరి నీటి లభ్యత 1400 క్యూబిక్ మీటర్లుగా ఉంటే వాడకం 801 క్యూబిక్ మీటర్లు మాత్రమే కాబట్టి వినియోగ సామర్థ్యాన్ని పెంచాల్సిఉంది. అన్ని చెక్‌డ్యాంల నిర్మాణాన్ని పూర్తిచేయాలి, ఎస్సారెస్పీలోనూ పూడికతీసి నీటినిల్వను 112 టీఎంసీలకు పెంచాలి.

నిల్వ నీటితో ప్రయోజనం- పి.రవి, శాస్త్రవేత్త, ఆర్‌ఏఆర్ఎస్, జగిత్యాల

తక్కువ వర్షపాత సంవత్సరాల్లో వర్షపునీటి నిల్వ ఎంతగానో ఉపకరిస్తుంది. వాగులపై నిర్మిస్తున్న చెక్‌డ్యాంలతో దాదాపు 3-6 టీఎంసీల అదనపు నీటినిల్వ, వినియోగం సాధ్యపడుతుంది. వర్షపునీటి ఆనకట్టలు, అడవుల్లో పర్క్యులేషన్ ట్యాంకులు, అన్ని చెరువులు, కుంటల్లో పూడిక తీతతో నీరు నిలిచి అనేక ప్రయోజనాలుంటాయి.

# కానరాని.. ఖనిజ సంక్షేమ నిధి



తాండూరు : జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ఖనిజ నిక్షేపాలు ఉన్నాయి. వీటి తవ్వకాలతో సర్కారుకు ఏటా రూ.కోట్లల్లో ఆదాయం సమకూరుతోంది. ఇందులోంచి కొంత మొత్తాన్ని గనుల ప్రభావిత గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు కేటాయిస్తోంది. వీటితో ఆయా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఆ మొత్తాన్ని మంజూరు చేయలేదు. దీంతో గ్రామాల్లో అభివృద్ధికి నిధుల్లేక ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో కథనం.

జిల్లాలోని ఇరవై మండలాల్లో ఎర్రమట్టి, సుద్ద, నాపరాయి, కంకర, పలుగురాయి, గ్రానైట్ నిక్షేపాలున్నాయి. దాదాపు 6వేల ఎకరాల్లో ఖనిజ నిక్షేపాల నేలలు ఉన్నాయి. వీటిని తవ్వకాల ద్వారా వెలికితీసి ఎగుమతులు చేసేందుకు ఏడు శాఖల ద్వారా సంబంధిత అనుమతులు జారీ చేస్తున్నారు. తవ్వకాలు, ఎగుమతులతో వ్యాపారులు గనులు భూగర్భ వనరుల శాఖకు రుసుం, సుంకం, తదితరాలను చెల్లిస్తున్నారు. వీటి ద్వారా సర్కారుకు ఏటా రూ.వంద కోట్ల ఆదాయం సమకూరుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.113.46 కోట్లు ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. వాస్తవానికి అంతకుమించి రూ.115.04కోట్లు ఆదాయం వచ్చింది. ఇందులోంచి రూ.22 కోట్ల నుంచి రూ.30కోట్ల వరకు గనుల ప్రభావిత గ్రామాల్లో సంక్షేమానికి ఖర్చు చేసేందుకు కేటాయించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదు.గ్రామాలకు కేటాయింపుల ఊసేది: లక్ష్యానికి మించి ఆదాయం సమకూరడంతో గనుల శాఖ ద్వారా కొంత మొత్తాన్ని డీఎమ్ఎఫ్‌టీ కమిటీకి చెల్లిస్తారు. జిల్లా మంత్రి ఛైర్మన్‌గా వ్యవహరించే కమిటీ ద్వారా కలెక్టర్ ఆధ్వర్యంలో ఖనిజ సంక్షేమ నిధిని జిల్లాలోని 566 పంచాయతీలకు మంజూరు చేస్తారు. వాటిని విద్య, వైద్యం, ఆరోగ్యం, రోడ్లు, ఉపాధి కల్పన, స్త్రీ శిశు సంక్షేమం, క్రీడలు, విగణిత విద్యకు సద్వినియోగం చేసే వీలుంటుంది. ఈ ఏడాది ఇప్పటివరకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో పల్లెల్లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు చేపట్టే వీల్లేకుండాపోయింది. గతేడాది నవంబరులో అసెంబ్లీ ఎన్నికల కోడ్, ఆ తర్వాత పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, అనంతరం ఎంపీ ఎన్నికల కోడ్‌ను ఈనెల 4న వరకు అమలు చేయడంతో నిధుల మంజూరుకు అవకాశం లేకపోయింది. 70 శాతం పంచాయతీ ఖాతాల్లో నిధులు లేక పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు ఆటంకంగా మారింది. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్, ట్యాంకుల శుభ్రత వంటి స్వచ్ఛత కార్యక్రమాలకు నిధుల కొరత నెలకొంది. ఖనిజ సంక్షేమ నిధులు విడుదల చేస్తే కొంతవరకు పల్లెల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు ఊరట కలగనుంది. కోడ్ ముగిసినా ఖనిజ సంక్షేమ నిధుల వినియోగంపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.త్వరలో కేటాయిస్తాం: శ్రీనివాస్, డీఆర్డీవో

నిధులు కలెక్టర్ పరిధిలో ఉన్నాయి. త్వరలో డీఎమ్ఎఫ్‌టీ కమిటీ సమావేశం నిర్వహించి నిధులు కేటాయించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. గ్రామాలకు నిధులు అందించేందుకు కృషి చేస్తాం.

# అటవీ భూమిని వీడని కబ్జా పర్వం!



బషీరాబాద్: రెండు దశాబ్దాలుగా తెలంగాణ అటవీ భూములను ఆక్రమించుకుని కర్ణాటక వాసులు సాగు చేస్తూ పంటలు పండిస్తున్నారు. అటవీ అధికారులు తరుచూ వెళ్లి హెచ్చరించి పంపించడం.. మళ్లీ అదే పరిస్థితి. ఈ భూమి తమదేనంటూ మన అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న భూమికి హద్దులు ఏర్పాటు చేసే అంశం చిక్కుముడిలా మారింది. వివాదం తేలకపోవడంతో తెలంగాణ అటవీ భూములను కర్ణాటక రైతులు కబ్జా చేస్తున్నారు. ఇరు రాష్ట్రాల అధికారులు సమావేశమై చర్చించి, హద్దులను నిర్ధరిస్తేనే ప్రయోజనముంటుంది.

1300 హెక్టార్ల వరకు: వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం పరిధిలో అటవీప్రాంతంలో సుమారు 1,300 హెక్టార్ల వరకు వికారాబాద్‌కు చెందిన అటవీ భూమే. అయితే కర్ణాటక రైతులు చెట్లను నరికేయడం, కబ్జా చేసి సాగు చేసుకోవడంతో అరణ్యం కాస్త సాగుకు అనువుగా మారిపోతున్నాయి. వారిని అడ్డుకునే ప్రయత్నం చేసినా, వినిపించుకోవడం లేదు. కర్ణాటక పరిధి సర్వే సంఖ్య 1, 2 లో ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని చెబుతున్నారు. దీంతో ఏమీ చేయలేకపోతున్నారు. దీనినే ఆసరా చేసుకుని సుమారు 200 ఎకరాలు కబ్జాకు గురైందని అధికారులే చెబుతున్నారు.

నిత్యం గొడవలు: కర్ణాటక వాసులు వచ్చి మన భూమిలో సాగుకు ఉపక్రమించడం, మన అధికారులు వెళ్లి అడ్డుకోవడంతో వారిపై పలుమార్లు గొడవకు దిగడం, ప్రత్యక్ష దాడులకు దిగిన సంఘటనలు ఉన్నాయి. ఉద్యోగ బాధ్యతలో న్యాయం చేయాలనే కోణంగా అటవీశాఖ అధికారులు రేయింబవళ్లు నిఘా పెట్టినా, ఉన్నతాధికారుల సహకారం లేకపోవడంతో నిస్సహాయ స్థితికి చేరుకుంటున్నారు. విత్తనాలు విత్తే సమయంలో అడ్డుకోవడం, మళ్లీ కొన్ని రోజులయ్యాక అధికారులు లేని సమయం చూసి కబ్జా కొనసాగించడం నిత్యకృత్యమైంది. పదేళ్లుగా ఇలాగే కొనసాగుతుండడంతో అధికారులు ఏం చేయలేకపోతున్నామని తలలు పట్టుకుంటున్నారు.

కొడంగల్ వద్ద: కొడంగల్ సరిహద్దు ప్రాంతంలోనే ఈ అటవీ భూమి కబ్జాల వ్యవహారం కొనసాగుతోంది. ఎడమవైపు కొడంగల్, కుడివైపు బషీరాబాద్, కర్ణాటక సరిహద్దు ఉంది. ఈ ప్రాంతాలకు ఆనుకునే అటవీ భూమి ఉంది. తాండూరు రేంజ్ అధికారులు ఇరు రాష్ట్రాల సంయుక్త సర్వేకు నివేదించామని, జిల్లా స్థాయి అధికారుల పరిధిలో ఉందని చెప్పడంతో సమయం ముగుస్తోందని కిందిస్థాయి అధికారులు ఆవేదన చెందుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ స్పందించి ఈ విషయంలో చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

సంయుక్త సర్వేకు నివేదించాం

బషీరాబాద్ మండలంలోని అటవీభూములు కర్ణాటక ప్రజలు కబ్జా చేశారని గుర్తించాం. నిరంతరం అడ్డుకుంటున్నాం.కబ్జా విడిపించి కొంత స్థలంలో మొక్కలు నాటాం. ఇరు రాష్ట్రాల అధికారుల సంయుక్త సర్వే చేయాల్సి ఉంది. జిల్లా రెవెన్యూ, అటవీశాఖల అధికారుల దృష్టికి తీసుకెళుతూనే ఉన్నాం. అటవీభూముల పరిరక్షణ అధికారి, జిల్లా పాలనాధికారికి మరోసారి విన్నవించి త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

శ్యాంసుందర్, అటవీశాఖ అధికారి, తాండూరు.

తెలంగాణ భూమిలో కన్నడీగుల సాగు

8మందిపై కేసు నమోదుతెలంగాణ సరిహద్దు మండలమైన బషీరాబాద్ అటవీ భూమిలో కర్ణాటక రైతులు చొచ్చుకొచ్చి భూములు సాగు చేస్తున్నారు. అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం అటవీ ప్రాంతాన్ని సందర్శించి కబ్జా విడిపించారు. సాగు చేసిన 8 మంది కర్ణాటక వాసులపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర రెవెన్యూ, పోలీసులకు సమాచారం అందించారు. కర్ణాటక రాష్ట్రం పలుగుకుచ్చ తండా, గోప్యానాయక్ తండాకు చెందిన వారిపై కేసు నమోదైంది.. తాండూరు రేంజ్ అధికారి శ్యాంసుందర్, పీర్యానాయక్, సిబ్బందితో కలిసి కబ్జా చేసిన అటవీ భూమి వద్దే ఉండి, తాండూరు, బషీరాబాద్, వికారాబాద్ సర్వేయర్లు, కర్ణాటక సేడం, ముదోల్‌కు చెందిన రెవెన్యూ, పోలీసు అధికారులు, సర్వేయర్లను అటవీ ప్రాంతానికి పిలిపించుకుని కబ్జా విషయమై తేల్చుదామని ప్రయత్నించారు. ఉన్నతాధికారులకు వివరించాకే సర్వే చేస్తామని కర్ణాటక అధికారులు వెళ్లిపోయారు. అప్పటి వరకు భూమిలోకి ఎవరూ రావొద్దని ఒప్పందం చేసుకున్నారు.

# గోదావరి నుంచి అత్యవసర పంపింగ్

హైదరాబాద్: నగర అవసరాలకు గోదావరి జలాల తరలింపునకు సంబంధించి అత్యవసర పంపింగ్‌కు జలమండలి సిద్ధమవుతోంది. 7 పంపులతో ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి ప్రాజెక్టు అప్రోచ్ ఛానెల్‌లోకి నీటిని ఎత్తిపోయనున్నారు. గురు, శుక్రవారాల్లో ట్రయల్‌రన్ ప్రారంభించిన అధికారులు...ఈ నెల 18 నుంచి పూర్తి స్థాయిలో అత్యవసర పంపింగ్ చేపట్టనున్నారు. నిత్యం 172 మిలియన్ గ్యాలన్లు అటు మిషన్ భగీరథతోపాటు ఇటు నగర అవసరాలకు అందిస్తున్నారు. కృష్ణా తర్వాత ఎక్కువ శాతం గోదావరి జలాలపైనే నగర ప్రజలు ఆధారపడ్డారు. ఈ జలాశయం పూర్తి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా...ప్రస్తుతం 5 టీఎంసీల జలాలు అందుబాటులో ఉన్నాయి. నగరానికి నీటిని తరలించే పంప్‌హౌస్‌కు నీటి సరఫరా తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో జలాశయం లోపల భారీ పంపులతో పంప్‌హౌస్‌కు వెళ్లే అప్రోచ్ ఛానెల్‌లో ఎత్తిపోయాలి.

నాగార్జునసాగర్‌లో ప్రస్తుత నీటి మట్టం 504.67 అడుగులు...500 అడుగుల వరకు నిత్యం 270 ఎంజీడీలను నగరానికి తీసుకోవచ్చు. రుతుపవనాల రాకతో వానలు కురుస్తున్నాయి. గోదావరిలోకి కొంచెం వరద పెరిగింది. ఎల్లంపల్లిలోకి కూడా వరద రావడంతో ఇక అత్యవసర పంపింగ్ అవసరం ఉండదని తొలుత అధికారులు భావించారు. వరద కంటే ఎక్కువ జలాలు వాడుతుండటంతో ఎల్లంపల్లిలోనూ నీటి మట్టం తగ్గుతోంది. దీంతో అత్యవసర పంపింగ్‌నకు జలమండలి సన్నాహాలు చేస్తోంది.

# ఆలయ ఉద్యోగుల్లో బదిలీల గుబులు

వేములవాడ : ఏళ్లుగా ఒకేచోట పాతుకుపోయిన ఆలయ ఉద్యోగులకు బదిలీల గుబులు పట్టుకుంది. దీర్ఘకాలంగా ఒకేచోట పని చేస్తున్న వారికి ఈసారి స్థానచలనం తప్పదని చెబుతున్నారు. వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ ఉద్యోగుల్లో కొద్ది రోజులుగా ఈ అంశంపై చర్చ సాగుతోంది. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆలయాల అధికారులతో ఇటీవల హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించి ఆలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సేవలు, ఉద్యోగుల బదిలీలు తదితర అంశాలపై చర్చించినప్పటి నుంచి ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. దీర్ఘకాలంగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న వారిని మార్చాలని, ఈ మేరకు జాబితా సిద్ధం చేయాలని దేవాదాయశాఖ అధికారులను ఆదేశించడంతో జాబితా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి, కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి, ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ స్వామి, భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి, బాసర శ్రీసరస్వతీ అమ్మవారు, సికింద్రాబాద్ గణేశ్ ఆలయాలతోపాటు మరో 14 చిన్న చిన్న దేవాలయాల్లోని ఉద్యోగులకు బదిలీల ప్రక్రియ చేపట్టి స్థానచలనం కల్పించనున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో బదిలీలు చేపట్టాలని నిర్ణయించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగులకు స్థానచలనం కల్పించి భక్తులకు మరింత మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో బదిలీల పర్వానికి తెర లేపినట్లు సమాచారం.ఇక్కడే ఉద్యోగం.. ఇక్కడే విరమణ

రాష్ట్రంలోని చాలా దేవాలయాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులకు బదిలీలు లేకపోవడంతో ఉద్యోగం పొందిన చోటనే విరమణ పొందిన సందర్భాలున్నాయి. చివరి వరకు ఒకేచోట పని చేస్తున్న వారు నిర్వహించిన విభాగాల్లో వివిధ రూపాల్లో అవినీతి మరకను అంటించుకున్నారు. వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో విజిలెన్స్ అధికారులు నిర్వహించిన దాడుల్లో వివిధ విభాగాల్లో పని చేస్తున్న 14 మంది అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. దీంతో విజిలెన్స్ అధికారులు ఆయా ఉద్యోగులకు నోటీసులు జారీ చేసిన సంఘటనలున్నాయి. చాలా మంది అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు వెల్లడైన సంఘటనలతో అప్రతిష్ఠను మూటగట్టుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఆలయాల్లో బదిలీలు చేపట్టి భక్తులకు సేవలు విస్తృతం చేయాలన్న ఆలోచనతో ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఆలయాల్లో భక్తులకు వసతులు మెరుగుపరచడంతోపాటు అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా సేవలందించాలనే ఆలోచనలో ప్రభుత్వం ముందుకు వెళ్లేందుకు ప్రణాళికలకు రూపకల్పన చేస్తున్నట్లు సమాచారం. దీంతో తొందరలోనే ఆలయాల్లో బదిలీలు జరుగుతాయని ఆలయ ఉద్యోగులు భావిస్తున్నారు. కొందరు ముందస్తుగా పైరవీలకు దారులు వెతుకుతున్నారు. ఇటీవల వరకు ఎన్నికల కోడ్ కారణంగా బదిలీలలో కొంత జాప్యం నెలకొంది. కోడ్ ముగియడంతో త్వరలోనే బదిలీల ప్రక్రియ మూడు, నాలుగు రోజుల్లో వెలువడనున్నట్లు ఆలయ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది

ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. బదిలీలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అంశం. ఎప్పుడు జరుగుతాయనేది చెప్పలేం. బదిలీలు జరిగితే తప్పక వివరాలు వెల్లడిస్తాం.- రామకృష్ణ, ఈవో, రాజన్న ఆలయం

# మురుగు శుద్ధి ఎప్పుడో?

సిరిసిల్ల : జిల్లా కేంద్రం.. సిరిసిల్ల పట్టణం రోజురోజుకు విస్తరిస్తోంది. జనావాసాలు, డైయింగ్ యూనిట్ల నుంచి నిత్యం 20 ఎంఎల్‌డీ (మిలియన్ లిక్విడ్ డిఛార్జి)లకు పైగా వ్యర్థ జలాలు నేరుగా మానేరు వాగులో కలుస్తున్నాయి. వీటిని శుద్ధి చేశాకే వాగులోకి పంపాలి. దీనిని సమర్థవంతంగా నిర్వహిస్తే స్వచ్ఛభారత్‌లో సిరిసిల్ల పురపాలికకు వాటర్ ప్లస్ హోదా లభిస్తుంది. 2022లో 30 ఎంఎల్‌డీ ల సామర్థ్యంతో ఎస్టీపీ (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇప్పటికే 95 శాతం పనులు పూర్తయ్యాయి. చివరగా పట్టణంలోని మురుగు కాల్వ అనుసంధానం, శుద్ధి చేసిన నీటిని వాగులోకి వదిలేందుకు పైపుల ఏర్పాటు వంటి చివరి దశ పనులు మాత్రం మిగిలి ఉన్నాయి. కాగా గుత్తేదారుకు బిల్లుల చెల్లింపులో జరుగుతున్న జాప్యం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ఈ ఏడాది కూడా పట్టణంలోని వరద నీటితోపాటు మురుగంతా వాగులోకి వెళ్లే పరిస్థితులే కనిపిస్తున్నాయి.జిల్లాలోని సిరిసిల్ల, వేము లవాడ రెండు పురపాలికల్లో ఎస్టీపీల నిర్మాణాలకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. వేములవాడ పట్టణంలో రహదారులు, మురుగు కాల్వల విస్తరణ పనులు అసంపూర్తిగా ఉండటంతో తొలుత సిరిసిల్ల పట్టణానికి రూ.61 కోట్లు మంజూరు చేశారు. వీటితో శాంతినగర్ శివారులో 30 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్టీపీ నిర్మాణానికి ప్రణాళికలు చేశారు. ఈ నిధుల నుంచే భూసేకరణకు పరిహారం ఇచ్చారు. ఎస్టీపీ



నిర్మాణానికి రూ.32 కోట్లు కేటాయించారు. దీనిలోనే అయిదేళ్ల నిర్వహణ కూడా గుత్తేదారు చేయాల్సి ఉంటుంది. రెండేళ్ల క్రితం ప్రారంభమైన పనుల్లో ఇప్పటికీ దాదాపు 95 శాతం పూర్తయ్యాయి. గుత్తేదారు సంస్థకు పూర్తి చేసిన పనులకు గాను దాదాపు రూ.25 కోట్ల వరకు ప్రభుత్వం నుంచి బిల్లులు రావాల్సి ఉంది. దీంతో చివరి దశ పనులు పూర్తి చేయడంలో మరింత జాప్యం జరుగు తోంది. ఎస్టీపీని ప్రారంభించి మురుగు శుద్ధి చేస్తే వాగులోకి వ్యర్థ జలాలు వెళ్లకుండా అడ్డుకట్ట పడుతుంది.

ఎత్తిపోతలతో అదనపు ఖర్చు పట్టణం నుంచి వస్తున్న వ్యర్థ జలాలు మొత్తం మానేరు కరకట్ట వద్ద నిలుస్తున్నాయి. వర్షాలకు వరద ప్రవాహం పెరిగితే ఎగువన పట్టణంలోని కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. దీనికోసం కరకట్ట వద్ద నిలిచిన నీటిని 125 అశ్వసామర్థ్యం ఉన్న మూడు మోటార్లతో ఎత్తిపోస్తున్నారు. ఇక్కడ మోటార్ల నిర్వహణ, విద్యుత్తు బిల్లులకుగాను ఏటా రూ.12 లక్షలపైనే చెల్లిస్తున్నారు. ఇదే ఖర్చుతో పట్టణం నుంచి వెలువడుతున్న మురుగు శుద్ధికి ఫిల్టర్ బెడ్‌లను నిర్మించి ఇసుకతో నీటిని శుద్ధి చేస్తే కాస్తయినా ప్రయోజనం కలిగేది. అధికారుల ప్రణాళికలేమి వల్ల రూ.కోట్లలో ప్రజాధనం నీటిలో పోస్తున్నారు.చివరి దశలో ఉందిఎస్టీపీ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. చివరి దశలో చేపట్టాల్సిన పనులు కొంతమేరకు మిగిలి ఉన్నాయి. త్వరలో వాటిని పూర్తి చేసి ట్రయల్‌రన్ నిర్వహించేలా ప్రణాళికలు చేస్తున్నాం. పూర్తయ్యాక నేరుగా మురుగు శుద్ధి ప్రక్రియ ప్రారంభిస్తాం.- లావణ్య, పురపాలక కమిషనర్, సిరిసిల్ల




# ఏపీలో యూట్యూబ్ అకాడమీ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు చర్చలు

అమరావతి: ప్రపంచస్థాయి టెక్ దిగ్గజ సంస్థలను, పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడమే లక్ష్యంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇందులో భాగంగా మంగళవారం ఆయన యూట్యూబ్ సీఈవో నీల్ మోహన్, గూగుల్ ఏపీఏసీ హెడ్ సంజయ్ గుప్తాలతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. రాష్ట్రంలో యూట్యూబ్ అకాడమీ ఏర్పాటుపై వారితో చర్చించినట్లు చంద్రబాబు 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. వారిద్దరితోనూ ఆన్‌లైన్ వేదికగా భేటీ కావడం ఆనందంగా ఉందని సీఎం పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నైపుణ్యాభివృద్ధి, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లను ప్రోత్సహించేందుకు స్థానిక భాగస్వాముల సహకారంతో ఈ అకాడమీ ఏర్పాటుపై చర్చించినట్లు తెలిపారు. అలాగే, ఏపీ రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయబోయే మీడియా సిటీకి సాంకేతిక సహకారం అందించే అవకాశాలపైనా వారితో చర్చించినట్లు పేర్కొన్నారు.




ఇంటి పైకప్పుపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లును తగ్గించుకునేందుకు 'ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన' పథకానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా కోటి మంది ప్రజలకు సౌర విద్యుత్ ఏర్పాటుకు రాయితీ ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఒక్కో ఇంటిపై గరిష్ఠంగా 3 కిలోవాట్లకు రూ.78 వేల చొప్పున రాయితీ ఇస్తోంది.

అయితే, తెలుగు రాష్ట్రాల నుంచి దరఖాస్తులు ఆశించిన మేరకు రాలేదని కేంద్రం ఇటీవల ఓ నివేదికలో వెల్లడైంది. ఈ పథకం గురించి సరైన అవగాహన లేకపోవడమే దీనికి కారణమని తెలుస్తోంది. ఇంతకీ ఈ పథకం కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి? పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకం రాయితీ కింద ఒక్కో కిలోవాట్‌కు రూ.30వేలు సబ్సిడీని కేంద్రం అందిస్తుంది. రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు అయితే రూ.78 వేలు మాత్రమే సబ్సిడీ లభిస్తుంది. అంటే మూడు కిలోవాట్ల సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేయడానికి రూ.1.45 లక్షలు ఖర్చయితే అందులో కేంద్రం గరిష్ఠంగా రూ.78 వేలు భరిస్తుంది. మిగిలిన మొత్తాన్ని పూచీకత్తు అవసరం లేకుండా తక్కువ వడ్డీకే బ్యాంకులు రుణాలు పొందొచ్చు.

ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ వంటి బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తున్నాయి.

**ఎవరికి ఎంత కెపాసిటీ :** నెలకు 0-150 యూనిట్ల విద్యుత్ వినియోగించే వారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందని సూర్యఘర్ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. 150-300 యూనిట్లు చొప్పున వినియోగించే వారు 2-3 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. 300 యూనిట్లకు పైబడి విద్యుత్‌ను వినియోగించే వారు 3 కిలోవాట్, ఆ పైబడి సామర్థ్యం కలిగిన సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. 3 కిలోవాట్లకు మించి సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నా గరిష్ఠంగా రూ.78 వేలు మాత్రమే సబ్సిడీగా చెల్లిస్తారు. మిగులు విద్యుత్‌ను కావాలంటే నెట్‌మీటరింగ్ ద్వారా విక్రయించుకోవచ్చు.

**ఆదా ఎంత..? :** సూర్యఘర్ వెబ్‌సైట్ ప్రకారం 1 కిలోవాట్‌కు సుమారు 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. అంటే ప్రస్తుత వినియోగం ప్రకారం నెలకు రూ.1000 విద్యుత్ బిల్లు వస్తుంది. అదే సోలార్ ఏర్పాటు వల్ల అయ్యే ఖర్చు రూ.338 మాత్రమే అవుతుంది. దీంతో ఏటా రూ.8వేలు ఆదా అవుతుంది. అదే నెలకు 240 యూనిట్లు వినియోగించే వారికైతే నెలకు రూ.2 వేల వరకు బిల్లు వస్తుందనుకుంటే.. సోలార్ వ్యవస్థ ఏర్పాటు వల్ల రూ.333 మాత్రమే ఖర్చవుతుంది. 360 యూనిట్లు వినియోగించే వారికి ఏటా రూ.32వేల వరకు ఆదా అవుతుందని ఏపీఈపీడీసీఎల్ తాజాగా 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. మీ వినియోగానికి ఎన్ని కిలోవాట్ల వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందో ఈ కాలిక్యులేటర్‌ను ఉపయోగించండి.

# విశాఖలో వైకాపాకు షాక్.. జనసేనలో చేరిన ఐదుగురు కార్పొరేటర్లు




మంగళగిరి: విశాఖపట్నంలో వైకాపాకు షాక్ తగిలింది. ఐదుగురు కార్పొరేటర్లతో పాటు పలువురు నేతలు జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ చేరికలు జరిగాయి. కార్పొరేటర్లతో పాటు పలువురు నేతలకు డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కండువా కప్పి తమ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "నేను డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఇదే తొలి రాజకీయ చేరికల కార్యక్రమం. నాకు ఇష్టమైన వైజాగ్‌తో మొదలైంది. ఇటీవల ప్రభుత్వ కార్యక్రమాలు అలవాటై.. రాజకీయ సమాశాలు కొత్తగా అనిపిస్తున్నాయి. మన రాష్ట్రం బాగుండాలి. విభజన తర్వాత నుంచి రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతో మనం నిలబడ్డాం. ప్రయాణం చేశాం. వైకాపా నాకు వ్యక్తిగతంగా శత్రువు కాదు.. ఇది చాలా సందర్భాల్లో చెప్పాను. ఒక్కోసారి నేతలు మాట్లాడే విధానం.. నమ్ముకున్నవారికి నష్టం చేస్తాయి. జనసేన మీ అందరికీ బలాన్ని ఇచ్చి.. ఎదగాలని కోరుకొనే వాతావరణం కల్పిస్తుంది. స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం మంచి విజయం సాధించాలని కోరుకొంటున్నా. అందుకు మీరంతా సహకరించాలి. విశాఖలో కాలుష్యం సమస్య చాలా ఎక్కువగా ఉంది. దీని నివారించేందుకు మీరంతా బాధ్యతతో పనిచేయాలి. విశాఖలో కాలుష్యాన్ని తగ్గించేందుకు త్వరలో కార్యాచరణ ప్రారంభిస్తాం" అన్నారు.

# నేడు చీరాలలో సీఎం చంద్రబాబు పర్యటన...

బాపట్ల: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు(బుధవారం) చీరాలలో పర్యటించనున్నారు. ఈ మేరకు చంద్రబాబు పర్యటన షెడ్యూల్ ఖరారైంది. చంద్రబాబు పర్యటన వివరాలను సీఎంవో ప్రకటించింది. జాండ్రపేట హై స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు.



సభా ప్రాంగాణాన్ని చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే కొండయ్య యాదవ్ పరిశీలించారు. రేపు మధ్యాహ్నం 3 గంటలకు జాండ్రపేటకు సీఎం చంద్రబాబు చేరుకోనున్నారు. నేతన్నలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ముఖ్యమంత్రి వస్తుంటడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# వైసీపీకి ఊహించని షాక్..

కాకినాడ: కాకినాడ జిల్లాలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు పార్టీకి రాజీనామా చేస్తారంటూ గత కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఆయన రాజీనామా చేయాలని డిసైడ్ అయిపోయారట.

వైసీపీకి రాజీనామాపై ముఖ్య నాయకులకు ఇప్పటికే పెండెం దొరబాబు క్లారిటీ ఇచ్చినట్టుగా తెలుస్తోంది. దొరబాబుతో పాటు పలువురు నియోజకవర్గ ముఖ్య నేతలు వైసీపీని వీడనున్నారు. వీరంతా బుధవారం రాజీనామాలు చేసే అవకాశం ఉంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పిఠాపురం సిట్టింగ్ సీటును దొరబాబుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిరాకరించిన విషయం తెలిసిందే. ఈ టికెట్‌ను వంగా గీతకు కేటాయించారు. పవన్ చేతిలో గీత ఘోర పరాజయం పాలయ్యారు. ఆసక్తికర విషయం ఏంటంటే.. పవన్‌పై పోటీకి సిద్ధమైన దొరబాబే.. వైసీపీకి రాజీనామా చేసి జనసేనలోకి వెళ్లేందుకు ఉత్సాహం ప్రదర్శించడం.

**పుట్టినరోజు సందర్భంగా..** పెండెం దొరబాబుకు ఎన్నికలకు ముందు జిల్లా పార్టీ అధ్యక్ష పదవి ఇస్తానని వైసీపీ అధినేత జగన్ హ్యాండ్ ఇచ్చారు. దీంతో దొరబాబు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఇటీవల జగన్ ఢిల్లీ ధర్నాకు దొరబాబు మొహం చాటేశారు. జనసేనలో చేరబోతున్నట్లు సంకేతాలు ఇచ్చేశారు. కొద్ది రోజుల క్రితం దొరబాబు తన పుట్టినరోజు సందర్భంగా అనుచరులతో భారీ సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమయంలో స్వాగత ఫ్లెక్సీలు, కటౌట్‌లో ఎక్కడా కూడా వైసీపీ జెండా కానీ జగన్ ఫోటో కానీ ఎక్కడా కనిపించలేదు. అప్పటి నుంచే దొరబాబు పార్టీ మారతారంటూ బీభత్సంగా ప్రచారం జరుగుతోంది. అప్పుడే అనుచరులతో మాట్లాడి రాజకీయ భవిష్యత్తుపై ఒక నిర్ణయాన్ని ప్రకటిస్తారని అంతా భావించారు. కానీ అప్పుడు ఎందుకో దొరబాబు ఆగిపోయారు. మొత్తానికి ఇప్పుడు ఆయన పార్టీ మారబోతున్నారని తెలుస్తోంది.




# బంగ్లా కల్లోలం.. ఒకే హోటల్‌లో 24 మంది సజీవదహనం!

ఢాకా: బంగ్లాదేశ్‌లో విధ్వంసం కొనసాగుతోంది. విద్యార్థి సంఘాల ఆందోళనలతో దేశం అట్టుడుకుతోంది. సైన్యం పాలన కొనసాగుతున్న బంగ్లాలో హింసాత్మక ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా జషోర్ జిల్లాలో అవామీ లీగ్ ప్రధాన కార్యదర్శి షాహిన్ చక్లాదర్‌కు చెందిన జబీర్ ఇంటర్నేషనల్ హోటల్‌కు అల్లరిమూకలు నిప్పు పెట్టాయి. ఈ ఘటనలో 24 మంది సజీవ దహనమైనట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఇందులో ఒకరు ఇండోనేషియా పౌరుడు కూడా ఉన్నట్లు సమాచారం. దీంతో బంగ్లాలో మృతుల సంఖ్య భారీగా పెరిగింది. 21 రోజులుగా కొనసాగుతున్న ఆందోళనల కారణంగా వందలాది మంది మృతి చెందారు. దీంతో ఇప్పటి వరకు మరణాల సంఖ్య 440కి చేరుకుంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు సైన్యం తీవ్రంగా యత్నిస్తోంది. షేక్ హసీనా రాజీనామా చేసి దేశం వీడిన తర్వాత కొన్ని గంటల్లోనే 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. హోటల్‌కు నిప్పు పెట్టిన ఆందోళనకారులు అగ్నిమాపక సిబ్బంది రాకుండా అడ్డుకున్నారు.

**అదుపులోకి పరిస్థితి..** హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటున్నా.. దేశంలో పరిస్థితి అదుపులోకి వచ్చే సూచనలు ఉన్నట్లు తెలుస్తోంది. హసీనాకు వ్యతిరేకంగా నిరసనల కారణంగా కొన్ని రోజులుగా మూసివేసిన పాఠశాలను తిరిగి తెరిచినట్లు సమాచారం. దుకాణాలు, కార్యాలయాలు తెరుచుకున్నాయి. దీంతో పరిస్థితి కాస్త అదుపులోకి వచ్చినట్లు తెలుస్తోంది. కాగా.. రిజర్వేషన్లకు స్వస్తి పలికి ప్రతిభకు పట్టం కట్టాలని మొదలైన ఆందోళనలు పీఎం పీఠాన్ని కూల్చేశాయి. పదవిని వీడి భారత్‌కు చేరుకున్న షేక్ హసీనా త్వరలో శరణార్థిగా లండన్‌కు వెల్లనున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే హింసాత్మక ఘటనలు పెరగకుండా సైనిక ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోంది.

# చంద్రబాబు హయాంలో ఓ విజన్ ఉంది.. రఘురామ ఆసక్తికర వ్యాఖ్యలు



ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి దిశగా పరుగులు పెడుతుందని ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు తెలిపారు. ఏపీలో ప్రభుత్వం మారిందని, చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అభివృద్ధిలో ముందుకు వెళ్తుందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి 55 రోజులు అవుతుందని.. కానీ సమయం ఇవ్వకుండా వైసీపీ నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో ఎన్నో పథకాలు అమలు అవుతున్నాయని తెలిపారు. జగన్ ప్రభుత్వం ఎంత అప్పు చేసిందో ఇంకా తెలియడం లేదని.. దీనిపై ఓ స్పష్టత రావాల్సి ఉందని చెప్పారు. రాష్ట్రంపై ఓ ప్రణాళిక లేకుండా వైసీపీ ప్రభుత్వం తయారు చేసిందని విమర్శించారు. చంద్రబాబుకు ఏపీని అభివృద్ధి చేసే సామర్థ్యం ఉందని తెలిపారు. అమరావతిలో వేసిన రోడ్లను కూడా వైసీపీ నేతలు మాయం చేశారని ఆరోపించారు. ఏపీకి రూ.15 వేల కోట్ల ఆర్థిక సహాయం కేంద్ర ప్రభుత్వం చేసిందని గుర్తుచేశారు. కేంద్ర సంస్థలకు చంద్రబాబు స్థలం కేటాయించారని, ఇప్పుడు రాజధానిలో నిర్మాణాలు పరుగులు పెట్టిస్తున్నారని ఎమ్మెల్యే రఘురామ పేర్కొన్నారు. "అమరావతిలో గజం ఇప్పుడు 40 వేలు ఉంది. ప్రజలకు ప్రభుత్వంపై విశ్వాసం ఉంది. రాజధాని అమరావతి అని అందరికీ నమ్మకం కలిగింది. తెలంగాణలో రియల్ ఎస్టేట్ సబ్దతగా ఉంది....తెలంగాణలో రేట్లు 10 శాతం తగ్గాయి...దీనికి కారణం ఏపీలో చంద్రబాబు నాయుడు రావటం. చంద్రబాబు హయాంలో ఒక విజన్ ఉంది. గతంలో కొందరు కలెక్టర్లు వైసీపీకి ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరించారు. ఐఏఎస్‌కు పూర్వవైభవం వచ్చేలా ఈ ప్రభుత్వం ఉంది. ఐఏఎస్ లకు చంద్రబాబు గతంలో ఎక్కువ గౌరవం ఇచ్చే వారు..ఇప్పుడు ఎమ్మెల్యేలకు సమయం ఇస్తామని కూడా చెప్పారు. ఎమ్మెల్యేలను జగన్ గతంలో పట్టించుకోలేదు. అందుకే ఆయన11 సీట్లకే పరిమితమయ్యారు. జగన్మోహన్ రెడ్డి నుంచి గతంలో అందరికీ ముప్పు ఉండేది...ఇప్పుడు జగన్‌కి ప్రజల నుంచి ఎలాంటి ముప్పు లేదు" అని రఘురామ పేర్కొన్నారు. "900 వందల మంది సిబ్బందిని వేసుకుని జగన్ ఎక్కడికి వెళ్తాడు. జగన్‌ను ఎవరు ముట్టుకుంటారు...? పార్లమెంట్‌లో ప్రశ్నల సమయంలో ఎక్కువ సోది ఉండదు. పార్లమెంట్ ఏడాదికి పని దినాలు 90 రోజులు ఉంటాయి. గతంలో అసెంబ్లీ సగం రోజులు కూడా జరగలేదు. నియోజకవర్గంలో ఐదు రోజులు పాటు ఉంటూ, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాను. నియోజకవర్గంలో మంచినీటి సమస్యను పరిష్కారిస్తున్నాను. స్కూల్స్ ఆధునీకరణ, హాస్టల్స్ , టాయిలెట్స్ నిర్మాణానికి ప్రజలందరూ ముందుకు వస్తున్నారు" అని రఘురామ పేర్కొన్నారు.

# జగన్ ఐదేళ్ల కాలంలో కాల్వల్లో పూడికలు కూడా తీయలేదు : మంత్రి నిమ్మల



అమరావతి: రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టులు నిండుతున్నాయని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎన్నడూ లేనంతగా అన్ని ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయి నీటి మట్టాలు ఉన్నాయని తెలిపారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. "రాయలసీమకు సాగు, తాగు నీరు అందిస్తున్నాం. ముందుగా రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు నింపుతున్నాం. జగన్ ఐదేళ్ల కాలంలో కాల్వల్లో పూడికలు కూడా తీయలేదు. కాల్వలకు మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం. జగన్ ప్రభుత్వంలో ఇరిగేషన్ శాఖ అధికారులకు పనిలేకుండా పోయింది" అని విమర్శించారు. ఈస్ట్, వెస్ట్ కెనాల్ ఎస్ఈ ప్రసాద్‌బాబుపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. నీటి విడుదలలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్ఈ బదిలీకి మంత్రి ఆదేశించారు.

# కాకినాడ పోర్టు మార్గంలో అన్ని లారీలు చెక్ చేయండి: మంత్రి మనోహర్ ఆదేశం



అమరావతి: కాకినాడ పోర్టు కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమాలకు చెక్‌పెట్టడంపై ఏపీ ప్రభుత్వం దృష్టి సారించింది. ఎనిమిది విభాగాల పర్యవేక్షణలో చెక్ పోస్ట్‌ను ఏర్పాటు చేసింది. కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి ముంబయి రోడ్డులో చెక్ పోస్టును ఏర్పాటు చేయగా.. నిన్న ఒక్కరోజే ఆరు లారీల్లో బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో కాకినాడ పోర్టు పీఎస్ వద్ద మరో చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. కాకినాడ పోర్టు మార్గంలో అన్ని లారీలూ తనిఖీ చేయాలని సూచించారు. ఇటీవల కాకినాడ పోర్టును పరిశీలించిన ఆయన.. అక్కడ బియ్యం అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించారు. రేషన్ మాఫియాకు కాకినాడ అడ్డాగా మారిందని ఆయన వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. కాకినాడ పోర్టు నుంచి ఇతర దేశాలకు రేషన్ సరుకులు వెళ్తున్నాయని మనోహర్ ఆందోళన వ్యక్తం చేశారు.

# చంద్రబాబు, లోకేష్ మంచి చేస్తున్నారు.. గోనె ప్రకాష్‌రావు ప్రశంసలు

అమరావతి: ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజలకు మంచి చేస్తున్నారని ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాష్‌రావు ప్రశంసించారు. సీఎం చంద్రబాబును మంగళవారం నాడు గోనె ప్రకాశరావు కలిశారు.

అనంతరం మీడియాతో గోనె ప్రకాశరావు మాట్లాడుతూ... జగన్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఏపీ , తెలంగాణ రాష్ట్రాల్లో రావణాసురుడు, శిశుపాలుడి పాలన పోయిందని ఆక్షేపించారు. బంధువులే తనకు తెలీదంటూ సీబీఐ కోర్టుకు అబద్దాలు చెప్పిన దుర్మార్గుడు జగన్ అని గోనె ప్రకాష్‌రావు విమర్శించారు.

**జగన్‌లా పరదాలు కట్టుకోలేదు..?** జన్మభూమి లాంటి కార్యక్రమాలు చంద్రబాబు చేపడితే విదేశీ విరాళాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఏపీలో 36 మందిని హత్య చేసినట్లుగా చెబుతున్న జగన్ వాటి వివరాలు బహిర్గతం చేయాలని గోనె ప్రకాష్‌రావు డిమాండ్ చేశారు. దేశంలోని ఏ ముఖ్యమంత్రి జగన్‌లా పరదాలు కట్టుకుని పర్యటించలేదని ఆక్షేపించారు. రాష్ట్రపతి పాలన అంటూ డిమాండ్ చేసిన జగన్‌కు సిగ్గుందా..? అని విమర్శించారు. ప్రజల నుంచి పూర్తి మెజార్టీ వచ్చాక రాష్ట్రపతి పాలన ఎలా అనుమతిస్తారని గోనె ప్రకాష్‌రావు ప్రశ్నించారు.

# సుప్రీంకోర్టు తీర్పును తప్పు పట్టిన చింతా మోహన్

న్యూఢిల్లీ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ తప్పు పట్టారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యంగ విరుద్ధమని, దేశ సమగ్రతకు విరుద్ధంగా సుప్రీం కోర్టు తీర్పు ఉందని మాజీ కేంద్ర మంత్రి, చింతా మోహన్ విమర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. సుప్రీం తీర్పు భారత అఖండతను దెబ్బతీసేలా ఉందని, దేశ పౌరుడిగా ధర్మాసనం తీర్పును వ్యతిరేకిస్తున్నానని అన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు దేశం పేదరికం, కులాల గురించి తెలుసా? అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టులో ఉన్న న్యాయమూర్తులు సంపన్నులని, వారు పేద వర్గాల గురించి తీర్పు ఇస్తారా? అని చింతా మోహన్ ప్రశ్నించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎప్పుడన్న దళిత వాడల్లో తిరిగారా? అని నిలదీశారు. ఎస్సీ వర్గీకరణపై న్యాయస్థానం అనాలోచిత, తల తిక్క తీర్పు ఇచ్చిందన్నారు. దేశంలో వెయ్యి ఉపకులాలు ఉన్నాయని.. ఎలా వర్గీకరణ చేస్తారని అన్నారు.

వర్గీకరణపై కమిషన్ వేయాలని, కేంద్ర ప్రభుత్వానికి.. రాష్ట్రాలకు తలకాయ లేదని ఎద్దేవా చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఎంపికలో క్రిమిలేయర్ ఉందా? అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టులో 34 మంది జడ్జీలు ఉంటే.. అందులో దక్షిణాది రాష్ట్రాల నుంచి ఉండేది ఐదుగురేనా?.. మిగిలినవారు ఉత్తర భారత దేశం నుంచి వస్తారా? అని చింతా మోహన్ ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఐదుగురు న్యాయమూర్తులు ఉన్నారని, ఢిల్లీ, ముంబై నుంచి 10 మంది న్యాయమూర్తులు ఉంటారా? అన్నారు. ఇది క్రిమిలేయరా ? ఇక్కడ వర్గీకరణ ఉందన్నారు. దేశ సమైక్యతను దెబ్బతీసేవిధంగా ప్రధాని మోదీ నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. రిజర్వేషన్లు జోలికి మోదీ వెళ్ళారని, షేక్ హసీనాకు పట్టిన గతి పట్టకుండా కేంద్రం రిజర్వేషన్ల జోలికి వెళ్ళొద్దని చింతా మోహన్ మరొకసారి సూచించారు.

# కపూర్ బ్యూటీ కాక పుట్టించిందిలా!

ఫేమస్ అవ్వడానికి సినిమాలతో పనేముంది. చేతిలో ఫోన్ అందులో ఇన్ స్టా గ్రామ్ ఉంటే చాలు. ఫేమస్ అవ్వడానికి అంతకు మించిన ఆయుధం ఏముంటుందని? నవతరం మోడల్స్ అంతా నిరూపిస్తున్నారు. సినిమాల్లో నటించకుండానే అంతకు మించిన పాపులారిటీని దక్కించుకుంటున్నారు. ఇన్ స్టా వంటి మాధ్యమాల ద్వారానే లక్షలు సంపాదిస్తున్నావారెంతో మంది. స్టార్ హీరోయిన్లు సైతం సినిమా ఛాన్సులు లేకపోతే పాలోయింగ్ నే ఎన్ క్యాష్ చేసుకుంటున్నారు. తమ సోషల్మీడియా ఖాతాల్లో బ్రాండ్స్ ని ప్రమోట్ చేస్తూ లక్షలు సంపాదిస్తున్నారు. భామా మణులకు ఇది అదనపు ఆదాయం గా కనిపిస్తుంది. బాలీవుడ్ హాట్ బ్యూటీ, ఫ్యాషనిస్ట్ ఆకాంశ రంజన్ కపూర్ చేసింది కొన్ని సినిమాలే అయినా సోషల్ మీడియలో



తిరుగులేని బ్యూటీగా వెలిగిపోతుంది. ఎప్పటికప్పుడు హీటెక్కించే ఫోటోలతో కుర్రకారులో గుబులు పుట్టిస్తుంది. వైవిధ్యమైన భంగిమలతో స్టైల్ కా బాప్ అనిపిస్తుంది. తాజాగా అమ్మడు మరోసారి చెలరేగిందిలా. ఇదిగో ఇక్కడిలా బ్లూ కలర్ ఫ్లోలర్ దుస్తుల్లో కపూర్ బ్యూటీ అందాల ఆరబోస్తూ అగ్గి రాజేసింది. తన లో బ్యూటీని అంతటి ఆవిష్కరిస్తూ వివిధ భంగిమల్లో కెమెరాకి ఫోజులిచ్చింది. పాలునరుగల సౌందర్యాన్ని ఎంతో అందంగా తీర్చి దిద్దింది. నెక్ పై అందమైన హారం ధరించింది. చెవులకు మ్యాచింగ్ పెద్ద పెద్ద బుట్టలు ధరించింది. చేతికి ఎంపిక చేసుకున్న బ్యాండ్...కాళ్లకు ధరించిన హీల్స్ ప్రతీది ఆకాంశ లో బ్యూటీని హైలైట్ చేసాయి. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. అమ్మడి అభిమానులు హాట్ కామెంట్లతో చెలరేగు తున్నారు. ఓసారి అమ్మడి పాస్ట్ లైప్ లోకి వెళ్తే.. 2021 లో నెట్ ఫ్లిక్స్ వెబ్ సిరీస్ తో అడుగు పెట్టింది. అక్కడా మంచి మార్కులు పడ్డాయి. అక్కడ నుంచే సినిమాలకు ప్రమోట్ అయింది.

# శ్రీలీల నెవ్వర్ బిఫోర్ లుక్

స్టన్నింగ్ లుక్స్‌తో కిల్ చేయడంలో తెలుగమ్మాయి శ్రీలీల తర్వాతే. ముంబై, ఢిల్లీ, బెంగళూరు, కోల్ కతా నుంచి వచ్చిన టాప్ మోడల్స్ కి సైతం శ్రీలీల బిగ్ కాంపిటీషన్. నటిగా తన కెరీర్ బెస్ట్ ఫేజ్ ని ఆస్వాధిస్తోంది. ఈ బ్యూటీ తనదైన నటన, డ్యాన్సులతో అద్భుత ఫాలోయింగ్ సంపాదించుకుంది. టాలీవుడ్ లో తక్కువ టైమ్ లో టాప్ హీరోయిన్ గా ఎదిగిన ప్రతిభావనిగాను శ్రీలీలకు గుర్తింపు ఉంది. సోషల్ మీడియాల్లో ఈ భామకు ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. తాజాగా శ్రీలీల హాట్ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. శ్రీలీల తెల్లటి పవర్ సూట్‌లో సంథింగ్ యూనిక్ గా కనిపిస్తోంది. ఆ కళ్లలో స్పార్క్.. మేని విరుపుల్లో కాన్ఫిడెన్స్ చూస్తుంటే నిజంగా శ్రీలీల స్టన్నర్ అని పొగిడేయాల్సిందే. ఈ భామ షైనీ అల్ట్రా గ్లామ్ బ్లేజర్ లో ఎంతో అందంగా మెరిసిపోతోంది. కెరీర్



మ్యాటర్ కి వస్తే.. తదుపరి యూత్ స్టార్ నితిన్ సరసన రాబిన్ హుడ్ చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా తర్వాత పలు చిత్రాలకు సంతకాలు చేసేందుకు సిద్ధమవుతోందని సమాచారం. అయితే ఇటీవల బాలీవుడ్ లో ఓ క్రేజీ ఆఫర్ ని ఈ భామ మిస్ చేసుకుందని కథనాలొచ్చాయి. దిగ్గజ దర్శకుడు డేవిడ్ దావన్‌తో శ్రీలీల ఓ సినిమాకి పని చేయాల్సి ఉంది. ఇందులో వరుణ్ ధావన్ హీరో. కానీ ఈ సినిమా ఆఫర్ కోల్పోయిందని సమాచారం. మేకర్స్ శ్రీలీలకు మొదట ఈ చిత్రాన్ని ఆఫర్ చేశారు. కానీ తనకు డేట్స్ లేకపోవడంతో సినిమా నుండి తప్పుకుంది. శ్రీలీల లాస్ మృణాల్ ఠాకూర్‌కు గెయిన్ అయిందని కూడా కథనాలొస్తున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఇది రొమాంటిక్ కామెడీ జానర్ లో మరో లెవల్ సినిమా అని ప్రచారం జరుగుతోంది.




# జాన్వీతో ఎన్టీఆర్ రొమాన్స్.. ఫ్యాన్స్‌కి చలి జ్వరమే



అతిలోక సుందరి శ్రీదేవి తనయ జాన్వీ కపూర్ టాలీవుడ్ లో అడుగుపెడుతోంది అంటే అది ఎంతటి ప్రతిష్ఠాత్మకమో ఊహించినదే. జాన్వీపై బోలెడన్ని అంచనాలున్నాయి. ఎన్టీఆర్ ఫ్యాన్స్ చాలా ఎక్స్ పెక్ట్ చేస్తారు. అయితే ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా జాన్వీ కపూర్ సర్వం వండి వారుస్తోందనడానికి తాజా సాంగ్ గ్లింప్స్ సరిపోతుంది. కొన్ని గడియల పాటు దేవర నుంచి రెండో పాట 'చుట్ట మల్లె చుట్టేస్తా..' షేక్ చేసింది. జాన్వీతో యంగ్ యమ రొమాన్స్ మరో లెవల్‌లో పండింది. ఇక ఈ పాటలో జాన్వీ కపూర్ ని ఎలివేట్ చేసిన తీరు కానీ, తారక్ యంగ్ ఛరిష్మాటిక్ లుక్స్ కానీ ఫ్యాన్స్ లో జ్వరం పుట్టించడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే తెలుగు గ్లింప్స్ వైరల్ గా దూసుకెళ్లింది. ఇదే పాట హిందీ వెర్షన్ గ్లింప్స్ కూడా అంతే వైరల్ గా మారుతోంది. ధీరే ధీరే అంటూ సాగే ఈ పాటలో డ్యాన్సింగ్ క్లిప్ ని ఎన్టీఆర్ అభిమానులు వైరల్ గా షేర్ చేస్తున్నారు. ముఖ్యంగా ఈ పాట కోసం రామజోగయ్య రాసుకున్న లైన్స్ కానీ, ఎంపిక చేసుకున్న లొకేషన్స్ కానీ, కొరియోగ్రఫీ కానీ, గ్లామర్ ఎలివేషన్ కోసం ఎంపిక చేసిన కాస్ట్యూమ్స్.. ఇలా ప్రతిదీ హైలైట్ గా ఉన్నాయి. కచ్చితంగా ఇది చలి జ్వరం పుట్టించే పాట అనడంలో ఎలాంటి సందేహం లేదు. చూస్తుంటే జాన్వీకి ఇంతకంటే బెస్ట్ డెబ్యూ వేరొకటి ఉండదేమో! అనేంత అందంగా తనను ఎలివేట్ చేస్తున్న తీరు ఆకట్టుకుంటోంది. ఇన్నాళ్లు జాన్వీని మోడ్రన్ దుస్తుల్లో వీక్షించిన ఆడియెన్ కి ఇలా చీరల్లో, కోక రవికెలో చూస్తుంటే నిజంగానే చలి జ్వరం వస్తోంది. చాలా హిందీ సినిమాలతో పోలిస్తే జాన్వీని ది బెస్ట్ గా కొరటాల శివ ఆవిష్కరిస్తున్నారని కూడా భరోసా కనిపిస్తోంది. మొత్తానికి జాన్వీ కపూర్ కి ఇది సంతృప్తికరమైన డెబ్యూ కాబోతోందనడానికి ఈ చిన్న గ్లింప్స్ సరిపోతుంది. ఇక పూర్తి సినిమాలో పెద్ద తెర నిండుగా జూనియర్ అతిలోక సుందరిని చూస్తూ మురిసిపోయేందుకు ఫ్యాన్స్ సిద్ధంగా ఉన్నారు. తెలుగులో చుట్టమల్లె, హిందీలో ధీరే ధీరే, తమిళంలో పత్తవైక్కుం, కన్నడలో స్వాతిముత్తే సిక్కంగైతే, మలయాళంలో కన్నినాథన్ కమనోట్టం .. ఇలా అన్ని భాషలలో ఈ పాట ఇప్పటికే వైరల్ గా దూసుకెళ్లింది. వెబ్ లో లైక్ లు క్లిక్ లతో హోరెత్తుతోంది. యువతరం దీనిని వైరల్ గా షేర్ చేస్తున్నారు. శిల్పా రావు గానంతో బాస్కో మార్టిస్ నృత్య దర్శకత్వం వహించిన ఈ పాట నిడివి 3 నిమిషాల 44 సెకన్లు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. ఈ పాటను వీక్షించాక .. రొమాంటిక్ ట్రాక్‌తో అభిమానులు ఫుల్ ఖుషీ అయ్యారు. ఒక అభిమాని ఇన్‌స్టాగ్రామ్‌లో "నాకు సీనియర్ ఎన్టీఆర్ - శ్రీదేవిని గుర్తు చేస్తున్నారు"అని వ్యాఖ్యానించాడు. ఈ పాట చాలా చాలా క్యూట్‌గా ఉందని ఓ అభిమాని వ్యాఖ్యానించాడు. చాలా మంది జాన్వీ ఇన్‌స్టాగ్రామ్‌లో పాటను చూసిన తర్వాత జూనియర్ శ్రీదేవి అని వ్యాఖ్యానించారు.

# మరో రికార్డ్ కి ప్లాన్ చేస్తున్న సూపర్ ఫ్యాన్స్



ఆన్ లైన్ లో పవర్ స్టార్ ఫ్యాన్స్, ఆఫ్ లైన్ లో మహేష్ బాబు ఫ్యాన్స్ ల రికార్డుల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మహేష్ బాబు ఫ్యాన్స్ ఇప్పటికే ఎన్నో సార్లు రికార్డులను సొంతం చేసుకున్నారు. ఇప్పుడు మరో రికార్డ్ కి సూపర్ ఫ్యాన్స్ రెడీ అవుతున్నట్లుగా ఇండస్ట్రీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. మరో అయిదు రోజుల్లో అంటే ఆగస్టు 9న మహేష్ బాబు పుట్టిన రోజు రాబోతుంది. ప్రతి పుట్టిన రోజుకు మహేష్ బాబు ఫ్యాన్స్ హంగామా చేయడం కామన్ గా ఉంటుంది. ఈసారి మహేష్ బాబు సినిమాకు సంబంధించి ఎలాంటి అప్డేట్ లేదు. అయినా కూడా సందడి మాత్రం కన్ఫర్మ్ అన్నట్లుగా ఫ్యాన్స్ లో చర్చ జరుగుతోంది. ఈ బర్త్ డే సందర్భంగా మహేష్ బాబు హిట్ మూవీ మురారి ని రీ రిలీజ్ చేయబోతున్నారు. ఆమధ్య మహేష్ బాబు హిట్ మూవీ రీ రిలీజ్ చేయడంతో రికార్డ్ స్థాయి వసూళు నమోదు అయిన విషయం తెల్సిందే. ఇప్పుడు అంతకు మించి, తమ రికార్డ్ ను తామే బ్రేక్ చేసుకోబోతున్నారు. మురారి సినిమా గతంలో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. ఇప్పుడు మురారిని ఫ్యాన్స్ చూసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ జెనరేషన్ మహేష్ బాబు ఫ్యాన్స్ చాలా కాలంగా మురారి ని థియేటర్ లో చూడాలని కోరుకుంటున్నారు. ఎట్టకేలకు మురారి సినిమా రీ రిలీజ్ కాబోతున్న నేపథ్యంలో వారంతా కూడా ఇప్పుడు ఫ్యామిలీ తో సహా వెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. కేవలం ఒక్క షో లేదా ఒక్క రోజులో మురారి సినిమా వెళ్లి పోకుండా సాధ్యం అయినన్ని ఎక్కువ రోజులు ఆడేలా ప్లాన్ చేస్తున్నారని సమాచారం అందుతోంది.

కృష్ణవంశీ దర్శకత్వంలో వచ్చిన మురారి సినిమాకు మణిశర్మ అందించిన సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒక ఫుల్ లెంగ్త్ ఫ్యామిలీ ఎంటర్ గా మురారి నిలిచింది. ఈ సినిమా లో హీరోయిన్ గా సోనాలి బింద్రే నటించగా కీలక పాత్రల్లో సత్య నారాయణ, లక్ష్మి, రవిబాబు, శివాజీ రాజా, గొల్లపూడి, సుకుమారి, చిన్నా, నాగేంద్రబాబు నటించారు.

# ఈడెన్ బర్గ్ లో మహాలక్ష్మి కాఫీ పార్టీ.. గుడ్ మూడ్ అంటూ..!

సీతారామం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు ఫేవరెట్ హీరోయిన్ గా మారిన మృణాల్ ఠాకూర్ ఆ సినిమాలో సీతామహాలక్ష్మి అలియాస్ నూర్జహాన్ పాత్రలో అదరగొట్టేసింది. హను రాఘవపూడి తనకోసం ఇచ్చిన ఛాన్స్ ని పర్ఫెక్ట్ గా వాడుకున్న మృణాల్ ఆ సినిమాతో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. ఇక ఆ తర్వాత హాయ్ నాన్న సినిమాలో కూడా ఇంప్రెస్ చేసింది. నానితో కలిసి చేసిన హాయ్ నాన్న కూడా మృణాల్ ఖాతాలో హిట్ సినిమాగా నిలిచింది. ఐతే తర్వాత వచ్చిన ది ఫ్యామిలీ స్టార్ మాత్రం నిరాశ పరిచింది. ఐతే సీతారామం సినిమా వచ్చి 2 ఏళ్లు అవుతున్న సందర్భంగా కాఫీ పార్టీ చేసుకుంది మృణాల్



ఠాకూర్. ప్రస్తుతం ఈడెన్ బర్గ్ లో ఉన్న అమ్మడు అక్కడ కాఫీ తాగిన ప్లేస్ లో ఫోటోలు దిగి తన సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఓ పక్క సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా సరే ఇలా ఖాళీ టైం లో జాలీ ట్రిప్ వేస్తుంది మృణాల్. సెట్స్ మీద ఆమె అందంగా కనిపించి నటనతో మెప్పించాలి అంటే షూటింగ్ గ్యాప్ లో ఇలాంటి విహార యాత్రలు ఉపయోగపడతాయని తెలుస్తుంది. బాలీవుడ్ లో హీరోయిన్ గా సినిమాలు చేస్తున్నా అంతగా పాపులారిటీ తెచ్చుకుని అమ్మడు తెలుగులో రెండు సినిమాలతో పాన్ ఇండియా లెవెల్ లో క్రేజ్ సంపాదించింది. రాబోతున్న సినిమాలతో కూడా మృణాల్ తన టాలెంట్ తో మెప్పించాలని చూస్తుంది. ప్రస్తుతం బాలీవుడ్ లో ఒక సినిమా చేస్తున్న అమ్మడు తెలుగులో నెక్స్ట్ సినిమా సైన్ చేయలేదు. ఐతే సినిమా కథల విషయంలో తన అభిరుచికి తగినట్టుగా ఎంపిక చేసుకుంటున్న మృణాల్ ఆమెలోని గ్లామర్ సైడ్ ని చూపించాలని చూస్తుంది. బాలీవుడ్ లో తనకు తగిన పాత్రలు రావడం లేదని ఆమధ్య ఒక ఇంటర్వ్యూలో చెప్పిన మృణాల్ సౌత్ లో మరీ ముఖ్యంగా టాలీవుడ్ లో వస్తున్న ఆఫర్లతో సాటిస్ఫైడ్ గా ఉంది. తప్పకుండా మృణాల్ ఇంకా ముందు ముందు ఛాలెంజింగ్ రోల్స్ తో మరింత సర్ ప్రైజ్ ఇవ్వాలని చూస్తుంది. మృణాల్ ఠాకూర్ ఒక మంచి నటిగా గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తుంది. సినిమాలు సక్సెస్ అవ్వడంలో తన పాత కీలకంగా మారుతుండటం వల్ల అమ్మడు ఇప్పటికే తన యాక్టింగ్ టాలెంట్ ప్రూవ్ చేసుకుందని చెప్పొచ్చు.

# టైట్ డ్రెస్ లో లైగర్ బ్యూటీ

బాలీవుడ్ స్టార్ చుంకీ పాండే కూతురు అనన్య పాండే హిందీ సినిమా స్టూడెండ్ ఆఫ్ ది ఇయర్ 2 తో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన విషయం తెల్సిందే. మొదటి సినిమాతోనే నటిగా అందరి దృష్టిని ఈ అమ్మడు ఆకర్షించింది. విజయ్ దేవరకొండ మూవీ లైగర్ లో నటించడం ద్వారా సౌత్ లో కూడా పాపులర్ అయ్యింది. లైగర్ సినిమా ఫ్లాప్ అవ్వడంతో తెలుగు లో మళ్లీ ఈ అమ్మడు కనిపించలేదు. కానీ హిందీలో మాత్రం వరుసగా సినిమాలు చేస్తూనే ఉంది. ఇటీవలే ఈ అమ్మడు యంగ్ స్టార్ హీరోతో సినిమా కమిట్ అయ్యిందనే వార్తలు వస్తున్నాయి. అందాల ఆరబోత విషయంలో ఈ అమ్మడు బాలీవుడ్ స్టార్ ముద్దుగుమ్మలతో పోటీ పడుతోంది. తాజాగా ఈ అమ్మడు సోషల్



మీడియాలో షేర్ చేసిన ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. టైట్ డ్రెస్ లో బాబీ అందాలను చూపడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. టైటిల్ డ్రెస్ లో మిర్రర్ సెల్ఫీ ని షేర్ చేయడం ద్వారా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ అమ్మడి అందంకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. విభిన్నమైన మేకోవర్ మరియు హెయిర్ స్టైల్ తో ఎప్పటికప్పుడు అందంగా కనిపిస్తూ ఆకట్టుకునే ఈ అమ్మడు మరోసారి తన అందమైన పిక్స్ తో నెటిజన్స్ కి కన్నుల విందు చేసింది. ఇంతటి అందగత్తెకి టాలీవుడ్ లో దక్కాల్సిన గుర్తింపు దక్కలేదు అంటూ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.



# గద్దర్‌తో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 6: ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి నేడు. ఈ సందర్భంగా గద్దర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళు లులర్పించారు. ఆయన చేసిన సేవలను సీఎం స్మరించుకున్నారు. "పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా... పోరు తెలంగాణమా" అంటూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయువుపట్టుగా నిలిచిన వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. పేద కుటుంబంలో పుట్టి ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన గద్దర్ ఉన్నత కొలువుల వైపు దృష్టి సారించకుండా ప్రతి ఒక్కరికి కూడు, గూడు, నీడ లభించాలనే లక్ష్యంతో జీవితాంత తన పాటలతో ప్రజలను చైతన్యపర్చారని పేర్కొన్నారు. తెలంగాణ జన సమితి, తెలంగాణ జన సభతో పాటు పలు ఉద్యమ సంస్థల ఏర్పాటుతో తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరులూదిన వారిలో అగ్రగణ్యుడు గద్దర్ అని గుర్తు చేశారు. పాటను తూటాగా మార్చిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని, ఆయన చేసిన సాంస్కృతిక, సాహితీ సేవకు గుర్తింపుగా నంది అవార్డులను గద్దర్ అవార్డులుగా తమ ప్రభుత్వం మార్చిందని తెలిపారు. గద్దర్‌తో తనకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు.

**ట్వీట్...** "పాటకు పోరాటం నేర్పి... తన గళంలో తూటాగా మార్చి... అన్యాయం పై ఎక్కుపెట్టిన... తెలంగాణ సాంస్కృతిక శిఖరం" గద్దరన్న వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను అంటూ సీఎం రేవంత్ ట్విట్టర్ వేదికగా తెలియజేశారు.

**సొంత మనిషిలా భావించి...** ప్రజా యుద్ధ నౌకగా పేరుగడించిన గద్దర్ అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. ఆయన మరణించిన సమయంలో రాజకీయ పార్టీలు స్పందించిన తీరు అప్పట్లో చర్చకు దారి తీశాయి. అయితే అప్పటి టీపీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి మాత్రం గద్దర్ అంతిమయాత్రలో అన్నీ తానై ముందుకు నడిపించారు. గద్దర్ మరణ వార్త తెలిసిన వెంటనే ఆస్పత్రికి చేరుకున్న రేవంత్.. భౌతికకాయాన్ని ఎల్బీస్టేడియంకు తరలించడం దగ్గర నుంచి అంతిమయాత్ర, అంత్యక్రియలు ఇలా అన్నింటిలో ముందుండి నిర్వహించారు. ప్రభుత్వ లాంఛనాలతో గద్దర్ అంత్యక్రియలు జరిగినప్పటికీ.. అక్కడ అన్నీ చూసుకుంది మాత్రం రేవంత్ రెడ్డే. ఒక్కమాటలో చెప్పాలంటే గద్దర్‌ను కాంగ్రెస్ తన సొంతమనిషిలా చూసుకుని ఘనంగా వీడ్కోలు పలికింది.

**మాట నిలబెట్టుకున్న రేవంత్..** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ప్రజాకవి గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానన్న రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు.

ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని తెల్లాపూర్ మున్సిపాలిటీ చేసిన తీర్మానాన్ని హెచ్‌ఎండీఏ ఆమోదించింది. ఈ నేపథ్యంలో విగ్రహ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తూ రేవంత్ సర్కార్ ఉత్తర్వులు కూడా జారీ చేసింది.

# బంగ్లాదేశ్ పరిస్థితులపై విదేశాంగ మంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్ట్ 06: పొరుగనున్న బంగ్లాదేశ్‌లో పరిస్థితులు వేగంగా మారుతున్నాయని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జై శంకర్ వెల్లడించారు. ఆ దేశంలో పరిస్థితులు సాధ్యమైనంత త్వరగా సాధారణ స్థితికి చేరుకుంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఢాకాలోని భారత రాయబార కార్యాలయం ద్వారా ఆ దేశంలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని చెప్పారు. బంగ్లాదేశ్‌లో చోటు చేసుకున్న తాజా పరిణామాలపై మంగళవారం రాజ్యసభలో కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్ ఓ ప్రకటన చేశారు. ఆ దేశంలో మొత్తం 19 వేల మంది భారతీయులు ఉన్నారని తెలిపారు. వారితో ప్రభుత్వం టచ్‌లోనే ఉందని వివరించారు.

**మైనారిటీల స్థితిగతులను పర్యవేక్షిస్తున్నాం..** అలాగే ఆ దేశంలోని మైనారిటీల స్థితిగతులను సైతం పర్యవేక్షిస్తున్నామన్నారు. బంగ్లాదేశ్‌లో విపరీతమైన దోపిడీలతోపాటు అల్లర్లు జరుగుతున్నట్లు పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య సరిహద్దు కాపలా దళాలను మరింత అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే ఆదేశించామని చెప్పారు. అదీకాక తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ఆ దేశ ఆర్మీ చీఫ్ ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ఎస్ జై శంకర్ గుర్తు చేశారు. మరోవైపు ఇటీవల చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో దాదాపు 8 వేల మంది భారతీయ విద్యార్థులు స్వదేశానికి తిరిగి వచ్చిన విషయం విధితమే.

**వరుస ఆందోళనలు.. చివరకు..** బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లలో సంస్కరణలు చేపట్టాలంటూ విద్యార్థులు ఇటీవల ఆందోళన బాట పట్టారు. దీంతో దేశవ్యాప్తంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఆందోళనలో వందల మంది మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. అయితే ప్రధాని పదవికి రాజీనామా చేయాలని షేక్ హసినాను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. దీంతో ఆమె తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం ఆమె భారత్ చేరుకున్నారు. పొరుగునున్న బంగ్లాదేశ్‌లో చోటు చేసుకున్న ఈ పరిణామాలపై మంగళవారం కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సైతం హాజరయ్యారు. ఈ సమావేశం అనంతరం మంత్రి జై శంకర్ రాజ్యసభలో పై విధంగా ప్రకటన చేశారు.

**వేగంగా మారుతున్న పరిణామాలు..** ఇంకోవైపు బంగ్లాదేశ్‌లో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ప్రభుత్వాన్ని రద్దు చేసి.. కొత్తగా మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటు చేసేందుకు చర్యలు ఊపందుకున్నాయి. మరికొద్ది రోజుల్లో కొత్త ప్రభుత్వం కొలువు తీరనుంది. ఈ ప్రభుత్వానికి ప్రధాన సలహాదారునిగా నోబుల్ అవార్డ్ గ్రహీత ప్రొ.యూనస్ వ్యవహరించనున్నారు.

# స్థానికత విషయంలో అనుమానాస్పదంగా ప్రభుత్వ తీరు: కేటీఆర్



హైదరాబాద్: మెడిసిన్ సీట్ల విషయంలో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం చేస్తారా అని కాంగ్రెస్ సర్కార్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. స్థానికత విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అనుమానాస్పదంగా కనిపిస్తున్నదని విమర్శించారు. జీవో 33 ప్రకారం నిర్దేశించిన స్థానికతలోని అంశాలు ప్రభుత్వం వేలితో విద్యార్థుల కళ్లను పొడిచినట్లే ఉన్నాయని ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. 9 నుంచి 12 తరగతి వరకు రాష్ట్రంలో చదివిన విద్యార్థులే స్థానికులు అవుతారని ప్రభుత్వం చెబుతున్నదని, దీని ప్రకారం చాలా మంది ఇతర రాష్ట్రాల విద్యార్థులే తెలంగాణలో లోకల్ అవుతారని చెప్పారు. హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ఉన్నందున ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల చాలా మంది ఇక్కడే విద్యాభ్యాసం చేస్తున్నారని వెల్లడించారు. కొత్త నిబంధనల ప్రకారం వారంతా తెలంగాణలో లోకల్ అవుతారన్నారు.

అదే విధంగా ఇతర రాష్ట్రాలలో చదివే మన విద్యార్థులు నాన్ లోకల్ అయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. 2023-24 విద్యాసంవత్సరం వరకు 6 నుంచి 12 తరగతి వరకు నాలుగేండ్లు గరిష్ఠంగా ఎక్కడ చదివితే అదే స్థానికతగా గుర్తించాం. దాని కారణంగా మన విద్యార్థులు ఇంటర్మీడియేట్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పటికీ వారు లోకల్‌గానే పరిగణించబడే వారు. తాజాగా ప్రభుత్వం చెబుతున్న కొత్త నిబంధనల ప్రకారమైతే వేలాది మంది ఇతర రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణలో లోకల్ అవుతారు. దీంతో మన విద్యార్థులు మెడిసిన్ సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరగకుండా.. గతంలో అనుసరించిన విధానాన్నే అనుసరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా "మెడికల్ సీట్లలో లోకల్‌కు కోత.." పేరుతో నమస్తే తెలంగాణ పేపర్‌లో వచ్చిన వార్త క్లిపింగ్స్‌ను కేటీఆర్ షేర్‌చేశారు.

# తెలంగాణ ఉద్యమ చరిత్రలో జయశంకర్ సార్‌ది ప్రత్యేక స్థానం: హరీశ్‌రావు



హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ స్వరాష్ట్ర స్వాప్నికుడు, సిద్ధాంతకర్త, ఉద్యమ భావజాల వ్యాప్తికి జీవితాంతం కృషి చేసిన మహనీయులని చెప్పారు. ఆయన చూపిన మార్గంలో, కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో జయశంకర్ సార్‌ది ప్రత్యేక స్థానమని వెల్లడించారు. జయహో జయశంకర్ సర్.. పిడికిలెత్తి పలుకుతోంది తెలంగాణ జోహార్ అంటూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇక జయశంకర్ సార్ జయంతిని హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి మండలిలో బీఆర్ఎస్ ఎల్పీ నేత మధుసూదనా చారి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పార్టీ నేతలు దేవీ ప్రసాద్, వాసుదేవ రెడ్డి తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

# స్వరాష్ట్ర సాధనలో దిక్సూచిగా నిలిచిన మీ కీర్తి అజరామరం.. ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు కేటీఆర్ ఘన నివాళి



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ సార్ తన జీవితాన్ని ధారబోసారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ భావజాల వ్యక్తికి సార్ చేసిన కృషి అనిర్వచనీయమని చెప్పారు. స్వరాష్ట్ర సాధనలో దిక్సూచిగా నిలిచిన వారి కీర్తి అజరామరమని, స్ఫూర్తి మరచిపోలేనిదని తెలిపారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయనకు కేటీఆర్ ఘనంగా నివాళులర్పించారు. పుట్టుక మీది.. చావు మీది.. బతుకంతా తెలంగాణది అని కీర్తించారు. సార్ అడుగుజాడల్లోనే తెలంగాణ రాష్ట్ర పోరాటం సాగిందని, రాష్ట్ర ప్రగతి ప్రస్థానం కొనసాగుతున్నదని చెప్పారు. "పుట్టుక మీది.. చావు మీది.. బ్రతుకంతా తెలంగాణది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని ధారబోసిన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా మా ఘన నివాళులు. తెలంగాణ ఉద్యమ భావజాల వ్యాప్తికి జయశంకర్ సార్ చేసిన కృషి అనిర్వచనీయం. స్వరాష్ట్ర సాధనలో ఒక దిక్సూచిగా నిలిచిన వారి కీర్తి అజరామరమైనది.. వారి స్ఫూర్తి మరిచిపోలేనిది. సార్ అడుగుజాడల్లోనే తెలంగాణ రాష్ట్ర పోరాటం.. తెలంగాణ ప్రగతి ప్రస్థానం. జోహార్ జయశంకర్ సార్! జై తెలంగాణ" అని కేటీఆర్ ట్వీట్ చేశారు.




బంగ్లాదేశ్ విద్యార్థుల ఆందోళన రాజకీయ రంగు పులుముకుంది. హింసను ఆపలేక షేక్ హసీనా గద్దె దిగాల్సి వచ్చింది. ఫలితంగా బంగ్లాదేశ్ సైన్యం పాలనలోకి వెళ్లింది. సైనికాధిపతి జనరల్ వకార్-ఉజ్-జమాన్ నేతృత్వంలో అక్కడ తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. మరి ఈ అల్లకల్లోలానికి కారకులెవరు? నిరసనలను అరికట్టాల్సిన సైన్యాధిపతే ప్రధానికి అల్టిమేటం ఎందుకిచ్చారు?

**విపక్షాలకు జమాన్ మద్దతు?** ఆందోళనలు హింసాత్మక రూపు దాల్చడంతో రాజీనామా చేయాలంటూ సైన్యం హసీనాకు 45 నిమిషాల సమయాన్ని ఇచ్చింది. దీంతో ఆమె పదవి నుంచి దిగిపోయి సోదరి షేక్ రెహానాతో కలిసి దేశాన్ని వీడారు. ఈ పరిణామాలు జరిగిన కాసేపటికే హసీనాకు ప్రధాన రాజకీయ ప్రత్యర్థి, మాజీ ప్రధాని ఖలీదా జియా (బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ)ను జైలు నుంచి విడుదల చేస్తూ అధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్ ఆదేశాలు జారీ చేయడం చర్చనీయాంశమైంది. ఇవన్నీ చూస్తుంటే రిజర్వేషన్లపై విద్యార్థులు చేస్తున్న ఆందోళనలను హసీనా ప్రత్యర్థులు తమకు అనుకూలంగా మార్చుకున్నట్లు స్పష్టమవుతోంది. బీఎన్‌పీ, దాని మిత్రపక్షమైన జమాత్-ఎ-ఇస్లామీ వంటి పార్టీలు ఈ ఆందోళనల వెనుక ఉన్నట్లు తెలుస్తోంది.

**నాడు భారత్ మాట విని ఉంటే..** కాగా.. వకార్-ఉజ్-జమాన్ ఈ ఏడాది జూన్ 23న బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్‌గా నియమితులయ్యారు. అయితే, అతడి గురించి హసీనాను భారత్ ఏడాది ముందే హెచ్చరించినట్లు సమాచారం. జమాన్ చైనా అనుకూల వ్యక్తి అని, అతడితో జాగ్రత్తగా వ్యవహరించాలని భారత జాతీయ భద్రతా మండలికి చెందిన కొందరు ఉన్నతస్థాయి అధికారులు హసీనాను అప్రమత్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయినప్పటికీ హసీనా ప్రభుత్వం అతడి నియామకానికే మొగ్గుచూపింది.

**అయిష్టంగానే ఎన్నికల్లో పోటీ..** ఇదిలాఉండగా.. ఈ ఏడాది జనవరిలో జరిగిన బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు హసీనా తొలుత విముఖత వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. మద్దతుదారుల బలవంతం మేరకు అయిష్టంగానే ఆమె బరిలోకి దిగారు.

ఐదోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. కానీ, సైన్యం కుతంత్రాలతో అనూహ్యంగా పదవీచ్యుతురాలు కావడంతో పాటు దేశాన్ని కూడా వీడాల్సిన పరిస్థితి ఎదురైంది.




# బాబోయ్.. కొండెక్కిన కోడిగుడ్డు ధర!

కోడి గుడ్డు ధర కొండెక్కింది. దీంతో సామాన్యులు కొనాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ఓ పక్క బహిరంగ మార్కెట్లో కూరగాయలు ధరలు మండిపోతుంటే కోడి గుడ్ల ధరలు సైతం అందనంత ఎత్తుకు చేరుకున్నాయని ప్రజలు వాపోతున్నారు. గత ఏప్రిల్‌లో రూ.4 నుండి రూ.4.50 వరకు పలికిన కోడ్డి గుడ్ల ధరలు, మే నెలలో రూ.5, 5.50కు చేరాయి. ఇక జూన్, జూలై నెలల్లో అంతకంతకూ పెరుగుతూ కొద్ది రోజుల్లోనే రూ.6.00, రూ.6.50కు చేరుకోవడంతో వినియోగదారులు కొనలేని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు మారుమూల పల్లెల్లో చిల్లరగా అయితే కోడి గుడ్లు రూ.7.50 వరకు విక్రయిస్తున్నట్లు గ్రామీణ ప్రజలు వాపోతున్నారు. ఎంతో కాలంగా చికెన్, మటన్ ధరలు మండుతుండటంతో, పలువురు మాంసాహారులు కోడి గుడ్లతో సరిపెట్టుకుంటున్నారు. అయితే ప్రస్తుతం కోడి గుడ్ల ధరలు కూడా అమాంతం పెరగడంతో వారికి దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

**డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేకనే..** మార్కెట్లో కోడి గుడ్ల వినియోగం భారీగా పెరిగింది. సాయంత్రం అయితే చాలు తోపుడు బండ్లపై ఆమ్లెట్లు, న్యూడిల్స్ తదితర ఫాస్ట్ ఫుడ్‌లో గుడ్ల వినియోగం విపరీతంగా పెరిగింది. వినియోగానికి తగినంత ఉత్పత్తి పెరగకపోవడంతోనే గుడ్ల ధరలు పెరుగుతున్నాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లాలో ప్రతి రోజూ లక్షకు పైగా కోడి గుడ్ల వినియోగం జరుగుతున్నట్లు వ్యాపార వర్గాల అంచనా. జిల్లాకు అత్యధికంగా మహబూబ్‌నగర్, హైదరాబాద్, బెంగళూరు నుంచి గుడ్లు దిగుమతి జరుగుతుంది. వర్షాకాలం ప్రారంభమైనందున గుడ్ల ధరలు త్వరలోనే తగ్గే అవకాశం ఉన్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.

# నాగార్జునసాగర్‌కు కొనసాగుతున్న వరద.. 22 గేట్ల ద్వారా దిగువకు నీరు



నల్లగొండ: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతున్నది. దీంతో అధికారులు 22 గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌కు 3,00,995 క్యూసెక్కుల వరద వస్తున్నది. అతే మొత్తం కిందికి వెళుతున్నది. క్రెస్ట్ గేట్ల ద్వారా 2,55,296 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7601 క్యూసెక్కులు, కుడి కాలువకు 7878, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 28,420 క్యూసెక్కులు, ఏఎమ్మార్ ప్రాజెక్టుకు 1800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎఇక ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులుకాగా, ప్రస్తుత నీటి మట్టం 585.30 అడుగుల వద్ద నీరు ఉన్నది. జలాశయంలో గరిష్ఠ నీటినిల్వ 312.50 టీఎంసీలు. ఇప్పుడు 298.30 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. సాగర్ నుంచి భారీగా వరద దిగువకు వెళ్తుండటంతో సూర్యాపేట జిల్లాలోని పులిచింతల ప్రాజెక్టు క్రమంగా నిండుతున్నది.

ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు కాగా, ఇప్పుడు 142.71 అడుగులుగా ఉన్నది. 45.77 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికిగాను 10.65 టీఎంసీలు ఉన్నాయి. ప్రాజెక్టుకు 74,443 క్యూసెక్కుల వరద వస్తుండగా, 25,676 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# రుణమాఫీ కాకపోయినా ఆందోళన వద్దు: మంత్రి తుమ్మల



హైదరాబాద్: గతంలో రుణమాఫీ సరిగా జరగలేదన్న భావన రైతుల్లో ఉందని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఓఆర్ఆర్‌ను రూ.7 వేల కోట్లకు అమ్మి రుణమాఫీ చేయాలని గత ప్రభుత్వం ఆలోచించిందని విమర్శించారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకులు సరైన పద్ధతిలో రుణమాఫీ చేయకపోయినప్పటికీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాత్రం విమర్శిస్తున్నారని మండిపడ్డారు. రైతుల ద్వారా రాజకీయ లబ్ధి పొందలేరని వ్యాఖ్యానించారు. "వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తోంది. ఎన్ని కష్టాలున్నా ఈ అంశంలో ముందుకెళ్తున్నాం. ప్రతిపక్ష నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారు. గత ఐదేళ్లలో రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తున్నాం. మూడు విడతల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. పాస్‌బుక్ లేకపోయినా.. తెల్లకార్డు ద్వారా రుణమాఫీ చేస్తున్నాం. రుణాలు మాఫీ కాకపోయినా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సాంకేతిక కారణాల వల్ల 30 వేల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. పొరపాట్లు సరిచేసి అర్హులందర్నీ రుణ విముక్తుల్ని చేస్తాం. ఆగస్టు 15న రూ.2 లక్షల వరకు రుణమాఫీ కార్యక్రమాన్ని వైరాలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు. రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ కొనసాగుతోంది" అని తుమ్మల వెల్లడించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com